Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 7013785256

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 5 విశాఖపట్నం, 3 అక్టోబరు 2024 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## చెత్తపన్ను రద్దు చేసిన చంద్రబాబు



ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అధికారులను ఎక్కడా ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేయరాదని ఆదేశించారు.

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పర్యటించిన చంద్రబాబు.. గాంధీ జయంతి సందర్భంగా ఇక్కడ నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రాష్ట్రంలో 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది. రోడ్లపై 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. ఏడాది లోపు ఆ చెత్త మొత్తం క్లీన్ చేయించాలని మంత్రి నారాయణను ఆదేశించాం. 2029 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలి.

ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారంటే దానికి కారణం స్వచ్ఛ సేవకులే. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సేవకులు కావాలి. కొందరు స్వార్థపరులు ఆంధ్ర జాతీయ కళాశాలను ఆక్రమించారు. సర్కార్ దాన్ని స్వాధీనం చేసుకుంటుంది. జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య పేరు మీద వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం.

అక్టోబర్ 2, 2014లో స్వచ్ఛ భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వీకారం చుట్టారు. ఇది ఎంతో గొప్ప కార్యక్రమం. దీనికి అందరం ప్రధానికి అభినందనలు తెలియజేయాలి. మన పరిసరాలు శుభ్రంగా ఉంటేనే... మనం ఆరోగ్యంగా ఉంటాం. బాపూజీ స్ఫూర్తితోనే స్వచ్ఛ భారత్ కార్యక్రమం తీసుకురావడం జరిగింది.

నీతి ఆయోగ్‌లో స్వచ్ఛ భారత్‌పై ఉపసంఘం ఏర్పాటు చేశారు. దీనికి ఛైర్మన్‌గా ఉన్నాను. 2 లక్షలకు పైగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో ఏపీని ఓడీఎఫ్ రాష్ట్రంగా మార్చాం. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను" అని చంద్రబాబు తెలిపారు.

## తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన ఇద్దరు కూతుళ్లతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం పవన్, ఆద్యతో పాటు చిన్న కూతురు పలీనా అంజలి కొణిదెల ఇప్పటికే తిరుమల చేరుకున్నారు. అయితే పలీనా క్రిస్టియన్ కావడంతో తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చింది. ఈ మేరకు టీటీడీ ఉద్యోగులు తీసుకువచ్చిన డిక్లరేషన్ పత్రాలపై పవన్ కూతురు సంతకం చేసింది. పలీనా అంజని మైనర్ కావడంతో తండ్రిగా పవన్ కళ్యాణ్ కూడా డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జనసేన పార్టీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. కాగా ఇటీవల మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటన సందర్భంగా డిక్లరేషన్ వివాదం నెలకొంది. హిందూ యేతరులు డిక్లరేషన్ పై సంతకం చేశాకే శ్రీవారి దర్శనానికి అనుమతివ్వాలంటూ కూటమి పార్టీలతో పాటు హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. అయితే ఆ తర్వాత జగన్ తిరుమల పర్యటన అనూహ్యంగా రద్దయ్యింది. ఈ వివాదం నడుస్తోన్న వేళ పవన్ కల్యాణ్ తన కూతురితో డిక్లరేషన్ పై సంతకం చేయించడం, తండ్రిగా తానూ సంతకం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తిరుమల శ్రీవారి (మిగతా 2లో)

## ఢిల్లీలో రూ.2వేలకోట్ల విలువైన కొకైన్ సీజ్!



దేశ రాజధాని నగరం ఢిల్లీలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం కలకలం సృష్టించింది. ఓ అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లింగ్ ముఠా నుంచి ఒకటికాదు రెండుకాదు ఏకంగా 500 కిలోల కొకైన్‌ను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ డ్రగ్స్ విలువ రూ.2వేలకోట్లకుపైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో పోలీస్ స్పెషల్ సెల్ బృందం దక్షిణ ఢిల్లీలో సోదాలు చేపట్టింది.

ఈ తనిఖీల్లో నలుగురు వ్యక్తులను నుంచి 560 కిలోలకుపైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో ఈ మాదక ద్రవ్యాల విలువ రూ.2వేల కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం పోలీసులు నిందితులను విచారిస్తున్నారు.

కాగా, ఇటీవల ఢిల్లీ పోలీసులు ఇద్దరు ఆఫ్ఘనిస్థాన్ పౌరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని విచారించగా.. భారీగా డ్రగ్స్ దందా నడిపిస్తున్న ఈ అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయ్యిందని పోలీసులు తెలిపారు.

## అలా చేస్తే క్రిమినల్ కేసులు పెడతాం



ఏలూరు కాల్ మనీ ఘటనపై స్పందించిన హోంమంత్రి వంగలపుడి అనిత... అధిక వడ్డీలు, అక్రమ వసూళ్లు చేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెడతామని వార్నింగ్ ఇచ్చారు. సామాన్య ప్రజలను వడ్డీల పేరుతో ఇబ్బంది పెట్టరాదని అన్నారు.

కిస్తీలకు ముందే వడ్డీ కోత, గడువు దాటితే డబుల్ కిస్తీ పేరుతో చేసే కాల్ మనీ వ్యవహారంపై హోంమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి జరగకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక నిఘా (మిగతా 2లో)

## గరుడ సేవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష



**తిరుపతి:** తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 8వ తేదీన జరిగే గరుడసేవకు లక్షలాదిగా విచ్చేసే భక్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో అదనపు (మిగతా 2లో)

## రాష్ట్రానికి రూ. 83,300 కోట్ల వరాలిచ్చిన మోదీ



ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనబోతోంది జార్ఖండ్. మహారాష్ట్రతో కలిసి ఒకేసారి పోలింగ్ జరగాల్సి ఉంది ఇక్కడ. ప్రస్తుతం హర్యానాతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది. ఈ రెండు చోట్ల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే జార్ఖండ్, మహారాష్ట్రల అసెంబ్లీ షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది.

జమ్మూ కాశ్మీర్‌లో మూడు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే. ఈ నెల 5వ తేదీన హర్యానాలో ఓటింగ్ జరుగనుంది. 8వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత జార్ఖండ్ మహారాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుంది.

మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి జార్ఖండ్‌లో. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 41. ప్రస్తుతం ఇక్కడ ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా అధికారంలో ఉంది. జార్ఖండ్ ముక్తి మోర్చా-కాంగ్రెస్- వామపక్షాల ప్రభుత్వానికి ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్ నాయకత్వాన్ని వహిస్తోన్నారు.

ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీఏ, ఇండియా కూటమి. గెలిచి తీరాలనే పట్టుదలతో ఉన్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి జేఎంఎం-కాంగ్రెస్- వామపక్షాలు, ఈ సారి అధికారంలోకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరాలని (మిగతా 2లో)

## మహాత్మాగాంధీ జయంతి రోజే ధాన్ ఫౌండేషన్ డే



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బుధవారం ధాన్ ఫౌండేషన్ 28వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అత్యంత ఉత్సాహ పూరితంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈరోజు గాంధీ జయంతి కావడంతో, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాధన్ గాంధీగారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జయంతి రోజే ధాన్ ఫౌండేషన్ డే కావడం విశేషం అన్నారు.. ఆయన ఆశయాలతో మీరంతా నడుస్తూ పేదరిక నిర్మూలన కోసం కలిసికట్టుగా పనిచెయ్యడం చాలా ఆనందం కలిగిస్తుందని అన్నారు. అలాగే దాన్ ఫౌండేషన్ లక్ష్యాలలో, అభివృద్ధిలో మేము కూడా భాగస్వామ్యం కావడం మాకు సంతోషంగా ఉందని అన్నారు. అలాగే మరో ముఖ్య అతిథి బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం ఎస్.సీతారాం మాట్లాడుతూ అన్ని సమాఖ్యల నుండి వచ్చిన నాయకులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసారు. ముందుగా ధాన్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిమలై అన్లైన్ ద్వారా ఇచ్చిన సందేశం సభికులకు స్ఫూర్తినిచ్చింది. అనంతరం వైజాగ్ రీజనల్లో సాధించిన ప్రగతిని పేదరిక నిర్మూలన దిశగా గత 25 సంవత్సరాలుగా నగరంలో 2300 గ్రూపుల ద్వారా 33 వేల కుటుంబాలతో పని చేస్తున్న తీరుని, ఫౌండేషన్ వైజాగ్ కో - ఆర్డినేటర్ శ్రీమతి శైలజ వివరించారు. సభ్యులందరి మొత్తం పొదుపులు 120కోట్లు కాగా 210 కోట్లు మిగిలి ఉన్న అప్పులు ఉన్నాయన్నారు. కేవలం ఆర్థిక విషయాలు మాత్రమే కాకుండా, భీమా, ఆరోగ్య కార్యక్రమాలు, జీవనోపాధి కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు ద్వారా కూడా ప్రజలతో కలిసి పనిచేస్తున్నామని అన్నారు. ఈ 25 సంవత్సరాల్లో నగరంలో 2129 కళంజియ కుటుంబాలు పేదరికాన్ని జయించాయని ప్రకటించారు, ఇది మనందరం కలిసికట్టుగా సాధించిన ప్రగతి అని తెలియజేశారు. అనంతరం మల్కాపురం కళంజియ సమాఖ్యలో పేదరికాన్ని జయించిన కళంజియ మహిళల విజయ గాథలు పుస్తకాన్ని కమిషనర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అలాగే పేదరికం నుండి బయటపడ్డ 5గురు మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడింగ్టన్ ఫౌండేషన్ నుండి విచ్చేసిన అతిథులు ధాన్ ఫౌండేషన్- రెడింగ్టన్ కలిసి చేస్తున్న క్యూర్ మరియు (మిగతా 2లో)



## (మొదటి పేజీ తరువాయిలు)

### తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించారన్న ఆరోపణల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. దీక్ష ముగింపు కోసం ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఇవాళ శ్రీవారిని దర్శించుకుని, ఆ తర్వాత దీక్ష విరమించనున్నారు.

### అలా చేస్తే క్రిమినల్ కేసులు పెడతాం

ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అక్రమ వసూళ్లతో అమాయకులను బలిచేసే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. వడ్డీ వ్యాపారాలను సీరియస్‌గా తీసుకున్నామని మంత్రి అనిత పేర్కొన్నారు. రోజువారీ వడ్డీల పేరిట సామాన్య జనాలను వేధించేవారిని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.

వైసీపీ నేత కాల్ మనీ దందాకు తాము బలయ్యామని ఇటీవల ఏలూరులో బాధితులు తమ గోడును వెళ్లబోశారు. తాము తీసుకున్న అప్పుకు అధిక వడ్డీలు కట్టించుకున్నారని వాపోయారు. సమయానికి అప్పు చెల్లించకపోతే అసభ్య పదజాలంతో తిట్టేవారని, భయపడి కట్టినా ఇంకా బకాయి ఉన్నారంటూ వేధించేవారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పు ఇచ్చిన సమయంలో తీసుకున్న ప్రామిసరీ నోట్లతో ఇప్పుడు తమను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు. కాగా, ఈ వ్యవహారంపై మంత్రి అనిత ఇప్పటికే ఏలూరు జిల్లా ఎస్పీతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

### గరుడ సేవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

ఈవో గరుడ సేవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా వాహనాల ముందు ప్రదర్శించే వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక బృందాల ప్రదర్శనలకు సంబంధించిన వీడియోను అదనపు ఈఓ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నాలుగు మాడ వీధులలో అన్న ప్రసాద వితరణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను అధ్యయనం చేశారు. ఇందులో అన్నప్రసాదాల తయారీ, పంపిణీ మార్గాలు, గ్యాలరీలలో ఉన్న భక్తులకు సజావుగా అన్నప్రసాదాలు పంపిణీ అయ్యేలా ఇతర విభాగాలతో సమన్వయం చేయడంపై చర్చించారు. సమావేశంలో రవాణా శాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, హెచ్‌డీపీపీ , విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్రానికి రూ. 83,300 కోట్ల వరాలిచ్చిన మోదీ

ఎన్డీఏ ప్రయత్నాలు సాగిస్తోన్నాయి.

ఈ పరిణామాల మధ్య జార్ఖండ్‌లో పర్యటించారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. 83,300 కోట్ల రూపాయల మేర విలువ చేసే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా హజారీబాగ్ గాంధీ మైదాన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు మోదీ.

సరిగ్గా 17 రోజుల వ్యవధిలో మోదీ జార్ఖండ్‌లో పర్యటించడం ఇది రెండోసారి. కిందటి నెల 15వ తేదీన ఆయన జంషెడ్‌పూర్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 80,000 కోట్ల రూపాయల విలువ చేసే పక్కా గృహాల నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేశారు.

2,800 కోట్ల రూపాయలతో నిర్మించిన 40 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించారు. ధర్తీ ఆబా జన్‌జాతి గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని మోదీ లాంచ్ చేశారు. దీని అంచనా వ్యయం 79,150 కోట్ల రూపాయలు. అంతకుముందు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఓ పాఠశాలను సందర్శించారు. అక్కడ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు.

### మహాత్మాగాంధీ జయంతి రోజే ధాన్ ఫౌండేషన్ డే

తీరప్రాంత అభివృద్ధి కార్యక్రమాల ప్రాజెక్టులు ఆవిష్కరించడం జరిగింది, ఈ సందర్భంగా క్యూర్ ప్రతినిధి శ్రీ లోకేష్, తీరప్రాంత ధాన్ కో.ఆర్డినేటర్ శ్రీమతి ధనలక్ష్మి, రూరల్ రీజియన్ కెఓ- ఆర్డినేటర్ రాంకుమార్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ డిపార్ట్మెంట్ జే.డి, జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ అప్పలనాయుడు, పాల్గొని ప్రసంగించారు. చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు.

ఈ కార్యక్రమంలో దాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ నాయకులు, పూర్వ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

### స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే భావన తో సీతారామ చంద్ర స్వామి వారి దేవాలయ లో నాటిన మొక్కలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే భావన తో స్వచ్ఛతా హీ సేవ - 2024 కార్యక్రమము ను తేదీ. 14-09-2024 నుండి 01-10-2024 వరకు జరుపు సందర్భముగా తేదీ. 02-10-2024 న "స్వచ్ఛ భారత్ దివాస్" కార్యక్రమము ను నిర్వహించుటలో భాగంగా మధ్యాహ్నం 3.00 గం.ల నుండి శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవాలయము నకు అనుబంధ దేవాలయమైన అంబికా బాగ్ లో గల శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణం లో మొక్కలను నాటుట జరిగినది.

## మహాత్మా! " బీజేపీ ఫాసిస్ట్ శక్తుల నుండి ఈ దేశాన్ని కాపాడు : కాంగ్రెస్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా! " బీజేపీ ఫాసిస్ట్ శక్తుల నుండి ఈ దేశాన్ని కాపాడు " అనే నినాదంతో డీసీసీ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు అధ్యక్షతన జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి బీజేపీ విభజించు పాలించు విధానం పై నిరసన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పడిన ఈ స్టీల్ ప్లాంట్ ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందని, ఈ పోరాటంలో కాంగ్రెస్ ముందుంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా గాంధీ శంకుస్థాపన చేసి, పీవీ నరసింహ రావు జాతికి అంకితం చేస్తే, మన్మోహన్ సింగ్ సర్కార్ ఈ ప్లాంట్ విస్తరణకు కృషి చేసిందని, విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, ఆంధ్రుల ఆత్మగౌరవంగా భావించే ఉక్కు పరిశ్రమలో 4000 కాంట్రాక్టు లేబర్ కి నోటీసు ఇవ్వడం, గుర్తింపు కార్డులు రద్దు చేయడం దారుణమని, ఇప్పటికే వారికి 5 నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని, వారు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని షర్మిల అన్నారు, తరువాత ఆమె స్టీల్ ప్లాంట్ కి వెళ్లి రోడ్డు మీద బెటాయించి రాస్తా రోకో చేసారు, బాధిత కార్మికులకు అండగా ఉంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి కాంట్రాక్టు కార్మికులకు 48 గంటలలో భరోసా ఇవ్వకపోతే అక్టోబర్ 4 మధ్యాహ్నం 1 గంటకు నిరాహార దీక్షకు దిగుతానని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు వేగి వెంకటేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహేష్,సీనియర్ నాయకులు కేవీఎస్, సోడాదాస్ సుధాకర్, సత్యా రెడ్డి, ప్రియాంక దండి, గుత్తుల శ్రీనివాస్, కేవీ లక్ష్మి,చిన్న బాబు, సంతోష్,గంగాధర్, ఆలీ, కస్తూరి వెంకట్ రావు,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు,జిల్లా అధ్యక్షులు సతీష్, శివకుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత - మన ఊరు బాగుకు మనమే ముందుకు రావాలి




**పాడేరు:** మన ఊరు బాగు చేసుకోవడానికి మనమే ముందుకు రావాలని, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పాడేరు మండలం వంజంగి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశంలో 750 గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆరు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. దేశంలో చట్ట ప్రకారం స్థానిక స్వపరిపాలనకు శ్రీకారం చుట్టినప్పటి నుండి గ్రామాలు ఒక యూనిట్ గా స్థానిక స్వపరిపాలన సాగుతుందని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని గుర్తించి మరింత అభివృద్ధి చేయడానికి వీలుగా ఈ ప్రత్యేక గ్రామసభను నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. గ్రామానికి, గ్రామానికి, సంఘంలోని ప్రజలకు, ప్రజలకు కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయని వాటిని సవరించి గ్రామస్తుల అవసరాల తెలుసుకొని అవసరాలు తీర్చే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల స్వచ్ఛత మన నుండే ప్రారంభం కావాలని, పరిశుభ్రత కోసం శ్రమదానం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ప్రతి శుక్రవారం రెండు గంటలు శ్రమదానం చేసి ఇల్లు పరిసరాలు శుభ్రం చేయాలని సూచించారు. అదేవిధంగా అక్టోబర్ నుండి జనవరి వరకు వంజంగిలో పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుందని వారు ఆ గ్రామంలో పర్యావరణానికి ఆటంకం లేకుండా ఎలా ఉండాలి అనే దానిపై పర్యాటకులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో గిరిజనుల కట్టుబాట్లు ఆచార వ్యవహారాలపై పర్యటకులకు అవగాహన కల్పించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా 70 సంవత్సరాలు నిండిన వృద్ధులను ఆహ్వానించి అప్పటికి ఇప్పటికీ జరిగిన అభివృద్ధి గూర్చి వారి అనుభవాలను పంచుకున్నారు.

ముందుగా మహాత్మా గాంధీ జన్మదిన సందర్భంగా కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన గావించిన కలెక్టర్ గిరిజన వృద్ధ మహిళలతో గాంధీ మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేయించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బిగ్ టీవీ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాలను వినిపించారు. అంతకుముందు కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు.

కార్యక్రమంలో భాగంగా 70 సంవత్సరములు నిండిన సుమారు 16 మంది సీనియర్ సిటిజనులకు ఘనంగా సన్మానించడం జరిగింది. అదేవిధంగా మరో 20 మంది క్లాఫ్ మిత్రలకు సన్మానించారు. అనంతరం గ్రామంలో శ్రమదానంచేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ఎస్వి కుమార్, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ తరపున ఆశీష్ యాదవ్, ఎన్ఐఆర్డీ ప్రతినిధి నాగరాజు, పిరమిల్ సంస్థ తరపున నారాయణ రెడ్డి, రేష్మ, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ వంజన్య కాంతమ్మ, ఎంపీటీసీ పాత్రుడు, సర్పంచ్ బొంజుబాబు, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు

**జిల్లాలో ఆరు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు**

పాడేరు మండలం వనజంగిలో జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ జరిగింది. గొందేలి గ్రామంలో సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ జరిగింది. గుత్తుల పొట్టు గ్రామంలో డిఆర్డిఏ పిడి వి మురళి ఆధ్వర్యంలో బడిమెల గ్రామంలో ఐ సి డి ఎస్ పి డి ఎన్. సూర్య లక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలు జరిగాయి. అదేవిధంగా హుకుంపేట మండలంలో జీకే మండ గ్రామంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆధ్వర్యంలో, మొట్టు జోరు గ్రామంలో డ్వామా పిడి శివయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలు జరిగాయి.

## యూట్యూబ్, సేటిలైట్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులను గుర్తించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సాటిలైట్, యూట్యూబ్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించి, జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు, ఇంటి స్థలాలు, రైల్వే బస్సు ప్రయాణాలలో రాయితీలు వంటివి కల్పించాలని కోరుతూ జై ( జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ యూట్యూబర్స్) న్యూస్ ఛానెల్స్ జర్నలిస్టులు నిరసన చేపట్టారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని విశాఖపట్నం జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ శాంతియుత నిరసన సందర్భంగా యూట్యూబ్ సాటిలైట్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులంతా ఐకమత్యంగా ఉండాలని ప్రభుత్వ పథకాలు మాకు చేరాలని న్యూస్ ఛానల్ జర్నలిస్టులందరినీ గుర్తించాలని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ యూట్యూబర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ రెడ్డి కోరారు.

మహారాష్ట్ర ప్రభుత్వం ఎలా అయితే యూట్యూబ్ జర్నలిస్టులను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తుందో అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల అధికారులు యూట్యూబ్ సాటిలైట్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులకు గుర్తించాలని కోరారు.

ఈ మేరకు ఇప్పటికే గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీల వరకు యూట్యూబ్ జర్నలిస్టులను కూడా గుర్తించాలని హృదయపూర్వక మీడియాతో అన్నారు. జేయ్ రాష్ట్ర అధ్యక్షులు యూవి రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలో సరవేగంగా సమాజానికి అందించడంలో యూట్యూబ్ సోషల్ మీడియా జర్నలిస్టులు ముందున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జై యూనియన్ యూట్యూబ్ సాటిలైట్ ఛానల్ జర్నలిస్టులు, జయ్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

| | |
|---|---|
| | గురువారం 03 -10-2024 |
| | క్రోధి నామ సంవత్సరము |
| | దక్షిణాయణం,శరదృతువు |
| పంచాంగం | ఆశ్వయుజ మాసం |
| తిథి | : శు. పాడ్యమి రా. 12.47 |
| నక్షత్రం | : హస్త ప. 02.57 |
| వర్జ్యం | : రా. 11.48 ల 01.34 |

## ఘనంగా కారుమూరి జన్మదిన వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎండాడ, లా కాలేజ్ రోడ్డులో ఉన్న వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వర్ రావు జన్మదిన సందర్భంగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి , శాసన మండలి సభ్యుల్లు కుంభ రవి బాబు , రాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు నాగేశ్వర్ రావు కి జన్మిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకట రామయ్య , రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల రవి రెడ్డి నియోజకవర్గం పరిశీలకు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగల అధ్యక్షులు పెర్ల విజయ్ చంద్ర, పోతిన శ్రీనివాసరావు, రాష్ట్ర అనుబంధ విభాగల ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీ వాస్తవ, మంతెన మాధవి వర్మ, పార్టీ నాయుకులు డాక్టర్ సిఎంఎ జహీర్ అహ్మద్, చెన్న దాస్ , కార్పోరేట్ బి.పి.ఎస్ కుమార్ జైన్ , జోన్లు అనుబంధ విభాగల ఇన్ చార్జ్ అల్లంపలి రాజు బాబు , వంకాయల మారుతీ ప్రసాద్, బి పద్మావతి, అనుబంధ విభాగల అధ్యక్షులు బోని శివ రామకృష్ణ, వానపల్లి ఈశ్వర్ రావు , సకలభక్తుల ప్రసాద్ రావు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగం సభ్యులు జగుపల్లి నరేష్, మలేశ్వారి, సూరిబాబు , మధు సంపాతి , అంబటి శైలేష్ , మధు రెడ్డి తదితరాలు పాల్గొన్నారు.

## సత్యం, అహింస అస్త్రాలుగా స్వాతంత్ర ఉద్యమం చేసిన మహనీయుడు జాతిపిత



**పాడేరు:** సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. బుధవారం స్వాతంత్ర జాతిపిత మహాత్మాగాంధీ, దేశ రెండవ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిలను పురస్కరించుకుని కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మహాత్మ గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ పూలమాలువేసి, పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ ఎన్నో పోరాటాలు సాగించారని, ప్రధానంగా సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖ పాత్ర వహించారని కొనియాడారు. మహాత్మా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా వాసులకు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో డి ఆర్ ఓ బి పద్మావతి, ఎఓ, కలెక్టరేట్లోని వివిధ విభాగాల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాఖాహార సద్భావన ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్ మెంట్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయసాధన "శాకాహార జగత్" లో భాగంగా పి ఎస్ ఎస్ ఎం వైజాగ్ అనకాపల్లి సంయుక్తంగా ఇందిరాలక్ష్మి ఆధ్వర్యంలో శాకాహార సద్భావన ర్యాలీని మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కొణతాల మాట్లాడుతూ ఆయన కూడా 30 సంవత్సరాలుగా శాకాహారిని అని చెప్పారు శాకాహారం వల్ల ఎటువంటి అనారోగ్యములు రావని చెప్పారు అసలు ఈ భగవంతుడు మన శరీరాన్ని పూర్తి శాకాహారిగా నిర్మాణం జరిగిందని చెప్పి అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంబించారు.

# విశాఖ సమాచారమ్

గురువారం 03-10-2024



ఈస్ట్ కోస్ట్ రైల్వే

టెండరు నెం. 30247131, తేదీ. 24.09.2024

పని పేరు: WDG4/4D HHP లోకో మోటివ్స్ నందు అమర్చిన మేధ AC-AC కంట్రోల్ సిస్టమ్ కొరకు LCC మరియు పవర్ సప్లయి అసెంబ్లీ మాడ్యుల్ అయిటంల సెట్.

పరిమాణం: 1 సెట్

సూచన: మెటీరియల్ 180 రోజులలో సప్లయి చేయాలి

టెండరు తెరచు తేదీ మరియు సమయం:

24.10.2024న 1500 గంటలు.

టెండరు డాక్యుమెంట్లు పూర్తి వివరములు లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ మెటీరియల్ మేనేజర్, వాల్తేరు

PR-570/P/24-25




## జాతిపితకు ఘన నివాళులు

**పాడేరు:** ఐటీడీఏ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ , భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారులు వివిఎస్ ప్రభాకర్ రావు, ఎం వెంకటేశ్వరావు పూల మాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి ఎం. హేమలత, ఐటిడిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్వయుజ మాసం విశిష్టత?

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు , మహేశ్వరుల దేవేరులైన సరస్వతి , మహాలక్ష్మి , పార్వతిదేవిలకు అత్యంత ప్రీతికరమైన......వారి పూజలకు ఉత్కృష్టమైన మాసం ఆశ్వయుజం !

జగన్మాత అయిన పార్వతిదేవి దుష్ట శిక్షణ , శిష్ట రక్షణార్థం , తొమ్మిది అవతారలను ధరించిన మాసం...ఆయుర్వేద దేవుడు అయిన ' ధన్వంతరీ , త్రిమతాచార్యులలో ద్వైత సిద్ధాంత ప్రవక్త శ్రీ మధ్వాచార్యులు జన్మించిన మాసం. దుష్ట దానవుడైన నరకాసురుడు అంతమొందింపబడి ప్రజలందరికి ఆనందాల వెలుగులను పంచిన దివ్య మాసము ఇది !

ఈ మాసం లోని తొలి తొమ్మిది రోజులు"దేవి నవరాత్రులు." సంప్రదాయబద్ధంగా పూజలు చెయ్యాలి అనుకున్న భక్తులు కలశాన్ని స్థాపించి , ముగ్గురు అమ్మల మూలపుటమ్మను ఈ నాటి నుండి తొమ్మిది రోజుల పాటు నియమముగా ఆరాధించాలి. దేవి పూజను ఆశ్వీయుజ మాసం అష్టమి , నవమిలలో పూజించిన భక్తులకు ఎటువంటి శోకాలు దరిచేరవు. దేవి పూజకు ఉత్కృష్టమైన ఈ రోజులలో అమ్మవారిని పూజించి రోజుకొక నైవేద్యం చొప్పున సమర్పించడం మంచిది. కలశ స్థాపనాదులతో పూజించలేని వారు , అమ్మవారి పటానికి గాని, విగ్రహానికి గాని , పుస్తకాలను గాని పూజిస్తూ స్తోత్ర, నామ పారాయణలను చేయవచ్చు.

ఈ విధముగ దేవి నవరాత్రులలో ఆ తల్లిని ఆరాధించడం వల్ల ఆ దేవి సంతృప్తురాలు అవుతుంది. అంతే కాకుండా దుష్ట , గ్రహ పీడలు నశించి అమ్మవారి కృప కటాక్షలు కలుగుతాయని చెప్పబడుతోంది.

అలాగే , ఈ మాసం లో సప్తమి రోజున గోపూజ చెయ్యవలెను. కపిల గోవును పూజించాలని , కేవలం పంచగవ్యములను మాత్రం స్వీకరించి ఉపవాసము ఉండవలెను.

పూర్ణిమ నాడు "నారదీయ పురాణము"ను పండితులకు తాంబూలములో వుంచి దానము ఇవ్వవలేను.

పూర్ణిమ నాడు స్త్రీలు జాగరణ చెయ్యటం వలన లక్ష్మిదేవి సంతోషించి , అష్టైశ్వర్యాలు ప్రసాదిస్తుంది అని శాస్త్ర వచనం.

ఈ నెలలోని బహుళ పక్షములో చతుర్దశి , అమావాస్య తిథులలో దీపాలను దేవాలయం , మఠము ప్రాకారాల్లోను , వీధులు , ఇంటి ముందు సాయంత్రము సమయములో వెలిగించుకోవడంవల్ల పితృదేవతలు సంతృప్తి చెందుతారని చెప్పబడుతోంది.

ఈ విధముగ ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకున్న మాసం ఆశ్వయుజ మాసం.

ఈ మాసం లో చేసే పూజలు , విధుల ఆచరణ వల్ల అనంతమైన పుణ్య ఫలాలు కలుగుతాయి. అనంత రూపాలలో విలసిల్లే శక్తిస్వరూపిణి అయిన ఆ తల్లి ఏ రూపములోనైనా , ఏ నామంతోనైనా ఆరాధించవచ్చు. ఆ తల్లి అమ్మలగన్న అమ్మ !.

తనను నమ్మిన భక్తులను ఎట్టి పరిస్థితులలో విడవకుండా కాపాడే కల్పవల్లి కరుణామయి..ఆ తల్లి !

## పదో తరగతి హిందీ సబ్జెక్టులో నాలుగు పాఠాలు తొలగించిన విద్యాశాఖ!




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ విద్యాశాఖలో పలు కీలక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే వంద పాఠశాలల్లో గత ప్రభుత్వం తీసుకొచ్చిన సీబీఎస్సీ విధానాన్ని కూటమి సర్కార్ రద్దు చేసింది. దీంతో ఈ ఏడాది ఆయా పాఠశాలల్లోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరినీ స్టేట్ సిలబస్‌కు మర్చుతున్నట్లు నిర్ణయం తీసుకుంది. వారంతా ఈసారి జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్టేట్ సిలబస్ ప్రకారంగానే పరీక్షలు రాయనున్నారు. అయితే వచ్చే ఏడాది నుంచి సీబీఎస్సీ విధానం తీసుకొస్తామని విద్యాశాఖ చెబుతుంది. ఈ క్రమంలో స్టేట్ సిలబస్‌లోనూ పలు మార్పులు చేస్తుంది.

తాజాగా పదోతరగతి హిందీ సబ్జెక్టులో సిలబస్‌ను తగ్గిస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌ను అమలు చేస్తున్నారు. దీంతో హిందీ సబ్జెక్టుకు సైతం ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలనే వినియోగిస్తున్నారు. ఇందులో పాఠాలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై దృష్టి సారించిన విద్యాశాఖ తాజగా నాలుగు పాఠాలను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. పద్యభాగంలో 7వ పాఠం, గద్యభాగంలో 11, 12 పాఠాలు, ఉపవాచకంలో మూడో పాఠాన్ని తొలగించారు. ఈ పాఠాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించాల్సిన అవసరం లేదని పేర్కొంది. పరీక్షల్లోనూ ఈ పాఠాల నుంచి ఎలాంటి ప్రశ్నలు ఇవ్వడం జరగదని స్పష్టం చేసింది.

కాగా సీబీఎస్ఈలో తొమ్మిదో తరగతి నుంచి ఐదు సబ్జెక్టుల విధానం ఉంటుంది. అక్కడ రెండో భాషగా హిందీ ఐచ్ఛికంగా తీసుకుంటారు. రాష్ట్రంలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను వినియోగిస్తున్నా ఆరు సబ్జెక్టుల విధానం అమలు చేస్తున్నారు. దీంతో ఐచ్ఛికం లేకుండా హిందీ తప్పనిసరిగా చదవాల్సిన సబ్జెక్టుగా మారింది. మరోవైపు గణితంలోనూ సిలబస్ కొండంత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ సబ్జెక్టులోనూ కొన్ని పాఠాలు తొలగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## స్వచ్ఛతా హీ సేవ 2024 ప్రచార కార్యక్రమం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎక్స్ పోర్ట్ ఇన్ స్పెక్షన్ ఏజెన్సీ చెన్నై, సబ్ ఆఫీస్ విశాఖపట్నంలో స్వచ్ఛతే సేవ 2024 కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల పరిశుభ్రతకు అధికారులు, సిబ్బంది అందరూ విశేష కృషి చేశారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, కార్యాలయ ఉద్యానవనం సుందరీకరణ చేపట్టారు.

## గిరిపుత్రుల సామాజిక ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం



విజయనగరం: వచ్చే ఐదేళ్ల కాలంలో గిరిజనుల సామాజిక ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతీయ గ్రామ ఉన్నత అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దేశంలోని 549 జిల్లాల్లో గిరిజనులు అధికంగా నివసించే 2,740 బ్లాకుల్లో అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో మౌళిక వసతులు అభివృద్ధి చేయడం, గిరిపుత్రులకు ఆర్థిక సాధికారత కల్పించడం, అందరికీ నాణ్యమైన విద్యావకాశాలను కల్పించడం, ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులు, గౌరవప్రదమైన వృద్ధ్యాప్య జీవనాన్ని కల్పించే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. 17 ప్రభుత్వ శాఖల ద్వారా 25 రకాల కార్యక్రమాలను ఐదేళ్ల కాలంలో అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జెసి సేతుమాధవన్ తో కలసి ఆవిష్కరించారు.

విజయనగరం జిల్లాలో బొబ్బిలి మండలం సిహెచ్.బొడ్డవలస పంచాయతీ నిమ్మలపాడు, మెరకముడిదాం మండలం కొండలవేరు, మెంటాడ మండలం కొండలింగాలవలస, లోతుగెడ్డ, బొండపల్లి మండలం వెదురువాడ, గంట్యాడ మండలం దిగువకొండపర్తి, ఎస్.కోట మండలం దారపర్తి, మూలబొడ్డవర, వేపాడ మండలం కొండగంగుపూడి తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డి.ఆర్.ఓ. ఎస్.డి.అనిత, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం తదితరులు పాల్గొన్నారు.

## ముజఫర్‌పూర్‌లో తప్పిన భారీ ప్రమాదం.. నీటిలో పడిన వాయుసేన హెలికాప్టర్..



నేపాల్ లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావం బీహార్ పై చూపిస్తోంది. బీహార్‌లో అనేక జిల్లాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. అయితే తాజాగా వరదల మధ్య పెను ప్రమాదం సంభవించింది. సహాయక చర్యల్లో నిమగ్నమైన ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ బుధవారం వరద నీటిలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఈ ల్యాండింగ్ ముజఫర్‌పూర్ జిల్లాలోని ఔరై నయా విలేజ్ వార్డు నంబర్ 13లో జరిగింది. హెలికాప్టర్ సీతామర్హి జిల్లా నుండి సహాయ సామగ్రిని పంపిణీ చేసి తిరిగి వస్తుండగా, ఔరై నయా గ్రామంలో ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు పైలట్లు, మరో ముగ్గురు వైమానిక దళ సిబ్బంది ఉండగా, వారందరూ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

ప్రస్తుతం బీహార్ వరదల్లో చిక్కుకుంది. ఎక్కడ చూసినా నీళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దాదాపు 16 లక్షల మంది వరదల బారిన పడ్డారు. వరద నీటి నుంచి ప్రజలను రక్షించడానికి, సహాయక సామగ్రిని పంపిణీ చేయడానికి పోలీసులతో పాటు, ఎయిర్ ఫోర్స్ సహాయం తీసుకున్నారు. బీహార్ వరద ప్రభావిత ప్రాంతాలకు ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్లు చేరుకుని ప్రజలకు ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్నాయి.

**రిలీఫ్ మెటీరియల్ పంపిణీ చేసి తిరిగి వస్తున్న ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్**

బుధవారం ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ సీతామర్హి జిల్లాలో సహాయక సామగ్రిని పంపిణీ చేసి తిరిగి వస్తుండగా హెలికాప్టర్ ఏదో తేడా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్‌లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయాలనీ కోరుకున్నారు. అయితే అన్ని చోట్లా నీరు ఉండడంతో పైలట్‌లు ఇద్దరూ దాన్ని నీటిలో దించాలని నిర్ణయించుకున్నారు. ముజఫర్‌పూర్ జిల్లా ఔరాయ్ బ్లాక్‌లోని ఘనశ్యాంపూర్ పంచాయతీ బేసి బజార్ సమీపంలో పైలట్ హెలికాప్టర్‌ను వరద నీటిలో దించాడు.

**సైనికుల ప్రాణాలను కాపాడిన గ్రామస్తులు**

తొలుత హెలికాప్టర్ నీటిలో పడిపోవడాన్ని స్థానికులు గమనించి.. వెంటనే అక్కడికి పరుగులు తీశారు. గ్రామస్థులు హెలికాప్టర్ దగ్గరకు చేరుకున్నారు. ఆ తర్వాత అందులో ఉన్న ఇద్దరు పైలట్లను, ముగ్గురు సైనికులను బయటకు తీశారు. హుటాహుటిన సైనికులను సురక్షిత ప్రదేశానికి చేర్చి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ప్రస్తుతం పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరుకుని హెలికాప్టర్ చుట్టూ ఉన్న నీటిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

**సహాయక సామగ్రిని కొల్లగొట్టడం, వీడియో వైరల్‌గా మారింది**

సహాయక సామగ్రిని హెలికాప్టర్‌లో ఉన్న విషయం గమనించిన గ్రామస్తులు సైనికులను తరలించిన తర్వాత వాటిని దోచుకోవడం ప్రారంభించారు. ప్రజలు తమ వెంట బస్తాలు తీసుకెళ్లారు. సహాయక సామగ్రిని కొల్లగొట్టిన అనేక వీడియోలు బయటపడ్డాయి. అందులో గ్రామస్తులు హెలికాప్టర్‌ను అన్ని వైపుల నుంచి చుట్టుముట్టారు. దానిలో ఉన్న సహాయక సామగ్రిని బయటకు తీస్తున్నారు.

## డల్లాస్ లో గాంధీ విగ్రహాన్ని సందర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**డల్లాస్/అమరావతి:** గత వారం రోజులుగా అమెరికాలో తన పర్యటనను విజయవంతంగా కొనసాగిస్తున్న రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా డల్లాస్ లోనే గాంధీ విగ్రహాన్ని సందర్శించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తో కలిసి స్థానిక తెలుగు సంఘాల ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది. అహింస, శాంతి ఆయుధంగా స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడి దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహానేత జాతిపిత మహాత్మా గాంధీ అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను గుర్తు చేసుకొని, భవిష్యత్ తరాలు మహాత్మా గాంధీ బాటలో పయనించాలని మంత్రి పిలుపునిచ్చారు.

రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతల మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ ప్రపంచ దేశాల్లో సుప్రసిద్ధులని శాంతి సమానత్వం కోసం ఆయన అహింసా మార్గంలో జరిపిన పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు

ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ కోఆర్డినేటర్ కోమటి జయరాం, ఎన్నారై ఇన్వెస్టర్స్ కోఆర్డినేటర్

రామకృష్ణ గుల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

## ఇకనుండి ప్రతి శుక్రవారం శ్రమదానం

**పాడేరు:** ఇకనుండి ప్రతి శుక్రవారం శ్రమదానం చేయాలని, తద్వారా కార్యాలయాలు కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛత హై సేవ ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో వెనుక వైపు ఉన్న పొదలను, తుప్పలను, ప్లాస్టిక్ వ్యర్థాలను కలెక్టర్ స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇకనుండి ప్రతి శుక్రవారం రెండు గంటల పాటు శ్రమదానం చేయాలని, కార్యాలయాల లోపల బయట పరిసరాలను పరిశుభ్రం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ కాంపౌండ్ వాల్ పరిశీలించి కలెక్టరేట్కు వచ్చిన సందర్శకుల వాహనాల పార్కింగ్కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా కలెక్టరేట్ రహదారిని పరిశీలించి త్వరలో సిసి రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్, డిఆర్ఓ బి పద్మావతి, ఏఓ, డి పి ఆర్ ఓ గోవిందరాజులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఎంపీ సీఎం రమేష్ కు అభినందనలు తెలిపిన పీలా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ సీఎం ని ఇండియా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా నియమించబడిన సందర్భంగా అనకాపల్లి టీడీపీ ఇంచార్జ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్,పీలా గోవింద సత్యనారాయణ గారు, తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్ మళ్ళ సురేంద్ర అభినందనలు తెలిపి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగాసత్కరించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బోద్దపు ప్రసాద్, పోలరపు త్రినాథ్, పిట్ల రాజు పొలిమేర ఆనంద్, ఫైలా గోపి, వేగి కృష్ణ, ఎండకుర్తి అప్పలరాజు, ఎస్.భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్, షేక్ రియాజ్, మొల్లి శీను, నంద్యాల గణేష్, ముప్పిడి మణికంత తదితరులు పాల్గొన్నారు.



*గాంధీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హిందీ పాత్రికేయులు, సంపాదకులు కె.వి.శర్మ చరఖా నూరుతూ పాల్గొన్నారు.*

*విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్)*

# పట్టణంలో ఘనంగా మహాత్మ గాంధీ జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జాతిపిత, మహాత్మాగాంధీ 155 వ జయంతి సందర్భంగా అనకాపల్లి మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ జీవియంసి కమిషనర్ వి. నాయుడు తో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీ బొమ్మ కూడలి, యన్. టి. ఆర్ మార్కెట్ యార్డ్ వద్ద గల గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా వివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ గారు మాట్లాడుతూ జాతిపిత, బాపూజీ గాంధీజీ సత్యాగ్రహం ఆయుధంగా శాంతియే మార్గంగా భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చారని అన్నారు. క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి శాంతియుత ఉద్యమాల ద్వారా ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ గుండెల్లో గుబులు కలిగించారని గాంధీ జీ పిలుపుమేరకు దేశమంతా ఒక తాటిపైకి వచ్చి ఉద్యమించిందని అన్నారు. ఎన్నో త్యాగాలు చేసి, దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరం పోరాటం చేసిన మహానుభావులని అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి యొక్క జీవితాన్ని మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని మనందరం శాంతియుత మార్గంలో దేశం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి జేజి బాబు, బొడ్డేడ రాము, పొలిమేర శివ అప్పారావు, కటారి దేవుడు, మొల్లి రవణ బాబు, దొడ్డి రమణ, వేగి పవన్ కుమార్, కోటిపల్లి శ్రీను, రేబాక ఇంద్ర కుమార్, ఆడారి రవికుమార్, నదవరపు కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని అక్టోబర్ 4న జిల్లా వ్యాప్తంగా నిరసనలు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి ఇచ్చిన ఎన్నికల వాగ్దానం ప్రకారం ఉచిత ఇసుక ఇవ్వాలని, ఇసుక సమస్య నివారించాలని, కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 4న రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో బాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాని పార్టీ శ్రేణులకు అనకాపల్లి జిల్లా కమిటీ పిలుపునిస్తోందనీ పార్టీ జిల్లా కార్యదర్శికే లోకనాథం అన్నారు.



గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగి విచ్చలవిడి అవినీతి వలన ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిరది. ప్రజల సమస్యలు పట్టకుండా, కనీసం భవన నిర్మాణాలు చేస్తున్న ప్రజలకు గాని, ఈ రంగంపై ఆధారపడిన కార్మికులకు గాని ప్రయోజనం లేకుండా చేయడంతో ఆ ప్రభుత్వంపై ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల పాలనలో ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడాలేకుండా పోయింది. అనేకచోట్ల ఇసుక లభించడం లేదని, రవాణా ఛార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదు. కొన్ని చోట్ల గతం కంటే అధిక ధరలకు ఇసుకను కొనుక్కోవలసి వస్తోంది. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నది. కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు ఇసుకపై పెత్తనం చేస్తున్నారు. ఇసుక కొరత, అధిక రేట్ల వలన భవన నిర్మాణరంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడుతోంది, ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్యతరగతి వర్గాలపై భారం పడుతుంది. ఇసుక ఆన్లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రకటించించినా ప్రభుత్వ ప్రకటనలకు, హామీలకు, ఆచరణకు పొంతనలేకుండా ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనబడుతోంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని, అందరికీ ఇసుక అందుబాటులోకి తీసుకురావాలి, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని సిపిఎం పార్టీ ప్రభుత్వాన్ని కోరుతున్నది. వీటి సాధన కోసం అక్టోబర్ 4న జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని లోకనాథం కోరారు.

# డైట్ కళాశాలలో జాతీయ రక్తదాన దినోత్సవం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. డైట్ క్యాంపస్ లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొని ఒక మహోన్నత కార్యం కోసం ఏకమయ్యారు.

ఎన్.టి.ఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు సహకారంతో రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, విద్యార్థులను సిబ్బందిని తరచుగా రక్తదానం చేసేవిధంగా ప్రోత్సహించడం ఈ శిబిరం లక్ష్యం. ఈ ప్రోత్సాహం తో చాలా మంది విద్యార్థులు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని గణనీయమైన మొత్తంలో రక్త యూనిట్లను సేకరించారు. ఇది కొన్ని వేళా మంది ప్రాణాలను కాపాడటానికి మరియు రక్త సరఫరాలో తీవ్రమైన కొరతను పరిష్కరించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఎన్.టి.ఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు అధికారి సునీత తెలియజేసారు.

డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా సమాజ శ్రేయస్సుకు తోడ్పడటం తమ సంస్థకు గర్వకారణమన్నారు. రక్తదానం చేసినటువంటి విద్యార్థులు, సిబ్బంది యొక్క ఉత్సాహం చూడటం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల్లో సామజిక బాధ్యతను, సమాజ సేవను పెంపొందించడానికి ఈ రక్తదాన శిబిరాన్ని డైట్ కళాశాలలో వార్షిక కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.




ఈ సందర్భం గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై దాతలకు అవగాహన కల్పించడంతో పాటు నిరంతరం ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటాది అని తెలియజేసారు. జాతీయ రక్తదాన దినోత్సవం ఈ సరళమైన ఉదార చర్య ద్వారా ఒక వ్యక్తి యొక్క ప్రాణరక్షణ ప్రభావాన్ని గుర్తు చేస్తుందని ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్ రావు,డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఈశ్వర రావు , అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, వివిధ ఇంజనీరింగ్ విభాగ అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్య లో విద్యార్థులు పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తిత్వం సీతారం ఏచూరి సొంతం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మహోన్నత వ్యక్తిత్వం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సొంతమని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు స్థానిక విజయ రెసిడెన్సి లో మంగళవారం సీతారం ఏచూరి సంతాప సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు జ్యోతి ప్రజ్వలన చేశారు అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన ఏచూరి జీవిత చరిత్ర తెలియజేసే సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ ఆయనతో తనకున్న పరిచయాలను వివరించారు. గొప్ప మేధావని మార్క్ స్ట్ యోధుడని కొనియాడారు .విశాఖ నగరంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు ప్రతి అంశంపై రాజ్యసభలో అనర్గళంగా మాట్లాడుతూ సమస్యలను ఎత్తిచూపేవారిని కొనియాడారు రాహుల్ గాంధీ వంటి వారు కూడా ఆయనకు సంపూర్ణ సహకారం అందించి దేశ రాజకీయాల్లో ఆయనకు ఒక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు .సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ఆయన కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు , మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు మాజీ శాసనసభ్యుడు పీల గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అటువంటి గొప్ప వ్యక్తులు అరుదుగా ఉంటారని చెప్పారు సిపిఎం నాయకులు లోకనాథం అజయ్ కుమార్ కాంగ్రెస్ నాయకులు మీసాల సుబ్బన్న ఆమ్ ఆద్మీ నాయకులు హరినాథ్ బాబా సిపిఐ నాయకులు దొరబాబు తదితర ప్రసంగించారు . సిపిఎం అనకాపల్లి పట్టణ కార్యదర్శి గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఏచూరి అభిమానులు పాల్గొన్నారు.

# మహాత్మునికి ఘనంగా నివాళు లర్పించిన నగర మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జాతిపిత మహాత్మా గాంధీ భారతదేశానికి అహింస మార్గంలో స్వాతంత్రాన్ని సాధించారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎండాడ వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో జిల్లా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాజీ మంత్రివర్యులు కారుమూరి నాగేశ్వరరావు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాజీ శాసనసభ్యులు చింతలపూడి వెంకటరామయ్య వైయస్సార్ పార్టీ నాయకులు శ్రీవత్స పలువురు కార్పొరేటర్లు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ సత్యాగ్రహం సహాయం నిరాకరణ తదితర మార్గాలతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహోన్నతు వ్యక్తి మహాత్మాగాంధీని కొనియాడారు.

# ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ లో ఎన్ఆర్ఐలు పెట్టుబడులు పెట్టడానికి ఇది సరైన సమయమని ఏపీ ఎంఎస్ఎంఇ, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. డల్లాస్ లో సోమవారం ఎన్ఆర్ఐ తెలుగుదేశం ఆధ్వర్యంలో ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరలోనే ఒక పోర్టల్ ప్రారంభిస్తున్నామని, దీని ద్వారా పెట్టుబడులు పెట్టేవారు అన్ని రకాల అనుమతులు పొందడం సులభతరం అవుతుందని వెల్లడించారు. ఎన్ఆర్ఐ లు తగిన ప్రతిపాదనలతో రావాలని పిలుపు ఇచ్చారు. వారికి కావాల్సిన అన్ని రకాల వసతులు, అనుమతులు వెంటనే ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని వివరించారు.

ఔత్సాహిక పెట్టుబడిదారులు తమ ప్రతిపాదనలతో ప్రభుత్వాధికారుల చుట్టూ తిరిగే రోజులకు ఈ ప్రభుత్వంలో కాలం చెల్లిందని చెప్పారు. ప్రభుత్వం రూపొందిస్తున్న యాప్ లో రిజిస్టరు అయిన వెంటనే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారులే వర్చువల్ కాల్స్ ద్వారా పెట్టుబడిదారులకు అందుబాటులోకి వస్తారని అన్నారు. వారితో టచ్ లో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేస్తూ, అన్ని రకాల సహకారం అందిస్తారని వెల్లడించారు.

ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వర్గధామం వంటిదని మంత్రి సూచించారు. రాష్ట్రంలో సంవత్సరానికి 50వేల మంది విద్యార్థులకు చివరి సెమిస్టర్ నుంచి ఐటీ శిక్షణలు కూడా అందివ్వబోతున్నామని ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. ఇందుకోసం ఐబిఎం ఇతర ఐటీ కంపెనీలతో ఒప్పందాలు కూడా చేసుకుంటున్నట్టు తెలిపారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వ సహకారంతో కెపాసిటీ బిల్డింగ్ సెంటర్లు పెడుతున్నామన్నారు.

ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఐ టీడీపీ కన్వీనర్ కోమటి జయరాం అధ్యక్షత వహించారు. సుధీర్ చింతమనేని, కె.సి. చేకూరి, రవీంద్ర చిట్టూరి, వినోద్ ఉప్పు, సతీష్ కొమ్మన, కిషోర్ చలసాని, కృష్ణమోహన్ దాసరి తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణ గుళ్లపల్లి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# కామాక్షి దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సురభి నాటకాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం నిదానందొడ్డిలో వేంచేసియున్న శ్రీ కామాక్షి దేవి దసరా నవరాత్రి మహోత్సవాలు ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను తెలియజేశారు. మంగళవారం అమ్మవారి ఆలయ మండపంలో దసరా నవరాత్రి మహోత్సవాల పుస్తకాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నవరాత్రులు లో ప్రతిరోజు ఒక కవతారంలో అమ్మవారు దర్శనాలు ఇస్తారని, మూడో తారీకు ప్రారంభం రోజున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుందని అని తెలియజేశారు. ఈ ఏడాది కూడా ఈనెల 9 10 11 తేదీల్లో రైతు భారత మేడ పైన సురభి నాటకాలు అత్యంత ఘనంగా దొరుకుతాయని అని తెలియజేశారు. ఆలయం వద్ద ఎస్ భారతి భాగవతారిణి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర హరికథా కాలక్షపు. ఈనెల పదో తారీఖున అమ్మవారి మూల విరాట్ కు యాలకులు, లవంగాలతో ప్రత్యేక అలంకరణ జరుగుతుందన్నారు. ఈనెల 14 తారీఖున ఆలయం వద్ద భారీ అన్న సమారాధన, అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో. ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శొంఠ్యాణసతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, పట్టణ విశ్వబ్రాహ్మణసంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజి బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ నరసింహాచారి, ఉత్సవ కమిటీ కన్వీనర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 155 వ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గాంధీజీ యొక్క ఆదర్శాలు మరియు విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. బాపూజీ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పట్టుదలగా నిలబడి, ఆచరించి, భారతదేశం స్వాతంత్ర్యం సాధించుటలో కీలక పాత్ర పోషించారు. భారత దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలోనే తనదైన ముద్ర వేసి మహోన్నత వ్యక్తిగా అవతరించారని, బాపూజీ చూపిన అహింసా, సత్యం సిద్ధాంతాలు నేటి పాలకులు, ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ టీ.వీ.విజయ్ కుమార్, అనకాపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ జి.అశోక్ కుమార్, మరియు ఇతర అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో మంచాలు వితరణ చేసిన లోచల రామక్రిష్ణ!



**పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి చాలా దారుణంగా ఉంది.. ఇటు ప్రభుత్వం గానీ.. గిరిజనాభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటిడిఏలు కానీ వీటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.. గిరిపుత్రులకు వైద్య సేవలు చేయడానికి కనీసం ప్రభుత్వాలకి అవకాశం లేదో.. ఇక్కడ ఎందుకులే వసతులు అనుకున్నారో తెలీదు గానీ.. జెర్రిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మౌళిక వసతులను గాలికి వదిలేశారు. లక్షల రూపాయాలు జీతాలు ఇచ్చి ఉద్యోగులను, వైద్యుల పెట్టిన ప్రభుత్వం వేల రూపాయాలు ఖర్చు చేసి ఇక్కడ రోగుల సౌకర్యార్థం కనీసం మంచాలు కూడా ఏర్పాటు చేయలేకపోయింది.. కాదు కాదు.. ఉన్నవి పాడైపోయినా పూర్తిగా పట్టనట్టు వదిలేసింది. ఏజెన్సీలోని నేతలు కూడా ఈ దీన పరిస్థితిపై కన్నెత్తి చూడలేదు. ఆ దారుణమైన పరిస్థితి కాస్తా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోచల రామక్రిష్ణ వరకూ వెళ్లింది. దీనితో స్పందించిన ఆయన మంచి మనసుతో ముందుకొచ్చారు. జీకే వీధి మండలం జర్రెల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల కోసం ఏర్పాటు చేసిన మంచాలు పూర్తిగా పాడై పోవడంతో తనవంతు సహాయంగా ఆరు మంచాల ఏర్పాటు చేయడానికి రూ.20వేలు సహాయం చేశారు.

ఆ మొత్తాన్ని ఆసుపత్రి సిబ్బంది.. గ్రామ పెద్దల సమక్షంలో వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లోచల రామక్రిష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం గిరిజనులకు ప్రాథమిక వైద్యం అందించాలని.. ఈ ఏజెన్సీ ప్రాంతంలో కనీసం వసతులు లేని పీహెచ్సీల్లో సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం గిరిజనులకు వైద్యసేవలు చేయడానికి రావాలనీ.. కనీసం ఆసుపత్రిలో రోగుల కోసం మంచాలు కూడా లేకపోతే గిరిజనులు వైద్యానికి వచ్చినా ఎక్కడు ఉండాలని ప్రశ్నించారు. ఇక్కడికి వచ్చే రోగులకు కనీసం వైద్య సేవలు అందే సమయంలో సేద తీరడానికి కూడా అవకాశం లేకపోవడం శోచనీయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం, ఐటిడిఏ అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌళిక సదుపాయాలతోపాటు ఖాళీగా ఉన్న సిబ్బందిని కూడా నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గిరిపుత్రులు ఆసుపత్రికి వచ్చే సమయంలో ఇబ్బందులు పడకూడదనే మంచి ఆలోచనతో మంచాల ఏర్పాటు కోసం లోచల రామక్రిష్ణ ముందుకి రావడం పట్ల గిరిజన ఉద్యోగుల సంఘం సభ్యులు, సహచర ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

# మద్యం నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మద్యం నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం, మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో మద్యం దుకాణాల పాలసీపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ 2024 సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించుటకు గెజిట్ నోటిఫికేషన్ ఇచిన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో 136 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించ బోతున్నామన్నారు. పూర్తి వివరాలు గెజిట్ లో పొందుపరచడం జరిగింది అని తెలిపారు. దరఖాస్తు చేయు వ్యక్తులు సదరు మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ మరియు లాటరీ నిర్వహించు విధానంను కలెక్టర్ గారికి వివరించడం జరిగింది.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ ఆఫీసర్ సుధీర్, ఎక్సైజ్ అధికరులు తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాత్మా గాంధీ 155 వ జయంతి వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జనసేన పార్టీ విశాఖ నగర పార్టీ కార్యాలయంలో మరియు గాంధీ విగ్రహం వద్ద జరిగిన మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమంలో విశాఖ జనసేన పార్టీ నగర అధ్యక్షులు నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మహాత్మా గాంధీ భారత దేశ స్వాతంత్రం కోసం అహింస ,సత్యం అయుధాలుగా చేసుకుని విజయం సాధించారని ఈ సందర్భంగా తెలిపారు . రాష్ట్రంలో గాంధీ మహాత్ముడు అడుగు జాడల్లో గౌరవ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల ఇన్చార్జులు ఉషాకిరణ్, ప్రశాంతి, శివ ప్రసాద్ రెడ్డి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మి, కార్పొరేటర్ నాగరాజు, మాజీ కార్పొరేటర్లు రాజు, ఉమ, పిల్లి రమణ, ఉత్తరాంధ్ర జిల్లాల మహిళా సమన్వయ కర్తలు,వివిధ వార్డుల అధ్యక్షులు ,టిడిపి ,జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 8 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య.. దోషికి మరణశిక్ష విధించిన పోక్సో కోర్టు



ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, ఆపై గొడ్డలితో నరికి చంపిన వ్యక్తిని దోషిగా నిర్ధారించిన పోక్సోకోర్టు అతడికి మరణశిక్ష విధించింది. ఒడిశాలోని సంబల్పూర్ జిల్లాలోని పోక్సో కోర్టు ఈ సంచలన తీర్పును వెలువరించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జిల్లాలోని జామన్కిరా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన బాలిక 25 మార్చి 2022లో సమీపంలోని పొలంలో ఆడుకునేందుకు వెళ్లింది.

ఆమె ఒంటరిగా ఉండడాన్ని గమనించిన నిందితుడు ప్రశాంత బఘూర్ బాలికను బలవంతంగా దూరంగా తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను గొడ్డలితో నరికి, ఆమె తల పట్టుకుని గ్రామానికి వచ్చాడు. బాలిక తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మొత్తం 25 మంది సాక్షులను విచారించిన కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది. అతడికి లక్ష రూపాయల జరిమానా విధించడంతోపాటు ఉరిశిక్ష విధిస్తూ నిన్న తుది తీర్పు వెలువరించింది.

# ఘనంగా రవిరెడ్డి జన్మదిన వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్నాథ్, కురుశాల కన్న బాబు, కారుమూరి నాగేశ్వర్ రావు , మాజీ శాసన సభ్యులు కరణం ధర్మ శ్రీ సమన్వయ కేకే రాజు, పార్టీ నాయకులు అల్లంపల్లి రాజాబాబు, పేర్ల విజయ్ చందర్, ద్రోణం రాజు శ్రీ వత్సవ, కాళిదాసు రెడ్డి, బోని శివరామకృష్ణ, బొండా ఉమా, బెవర జగదీష్, మంచాల మల్లేశ్వరి, అంబటి శైలేష్, జగలపల్లి నరేష్ పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రులు



నేటినుంచి అమ్మవారి పండగలు మొదలు అయ్యాయి.

దేశవ్యాప్తంగా దసరా ముఖ్యమైన పండుగ. ఇది శక్తి ఆరాధనకు ప్రాముఖ్యతను ఇచ్చే పండుగ. శరదృతువు ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నాడు ఈ పండుగ ఉత్సవాలు, దేవీ పూజలు మొదలవుతాయి. శరదృతువులో జరుపుకునే ఈ నవరాత్రులను శరన్నవరాత్రులు అని కూడా పిలుస్తారు.

తెలుగు వారు పదిరోజులపాటు అట్టహాసంగా నిర్వహించే దసరా వేడుకలు, పూజల గురించి అనుకుంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ నడిబొడ్డులో కృష్ణానది ఒడ్డున చఇంద్రకీలాద్రి పర్వతంపై వున్న చకనకదుర్గ దేవాలయం. ఇక్కడ అంగరంగ వైభవంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలలో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారు. తిరుపతి తర్వాత ఆంధ్రలో రెండవ పెద్ద దేవాలయంగా కనకదుర్గ గుడి ఖ్యాతిగాంచింది. చమహాభారతంలో పాండవులు వనవాసానికి దారుకావనానికి వచ్చినప్పుడు వేద వ్యాసుని సలహామేరకు శివుని గూర్చి తపస్సు చేసి, పాశుపతాస్త్రాన్ని సంపాదించడానికి అర్జునుడిని ఎన్నుకుంటారు. చఅర్జునుడు ఇంద్రకీలాద్రిపై ఘోరమైన తపస్సు చేసి శివుని నుండి పాశుపతాస్త్రాన్ని పొందుతాడు. చశివలీలలు, శక్తి మహిమలు ఆలయంలో అక్కడక్కడ కనిపిస్తాయి.

**పేరు వెనుక చరిత్ర**

కృతయుగానికి పూర్వం కీలుడు అనే యక్షుడు అమ్మవారి గురించి తపస్సు చేసి, ప్రత్యక్షం చేసుకుని ఆమెను తన హృదయ స్థానంలో నిలిచి ఉండమని కోరాడు. అమ్మ వారు కీలుని పర్వతంగా నిలబడమని కృత యుగంలో రాక్షస సంహారం చేసిన తరువాత తాను ఆ పర్వతం మీద నిలిచి ఉంటానని మాటిచ్చింది.కీలుడు కీలాద్రిగా మారి అమ్మ వారి కొరకు ఎదురుచూస్తూ ఉన్నాడు. అమ్మ వారిని సేవించుకోవడానికి ఇంద్రాది దేవత లు ఇక్కడకు తరచూ రావడం వలన కీలాద్రి ఇంద్రకీలాద్రిగా మారింది. ఇక్కడ స్వయంభువుగా వెలసిన త్రైలోక్య మాత మహిషాసురమర్ధిని కనకవర్ణంతో వెలుగుతున్న కారణంగా కనకదుర్గ అయింది.

ఆదిశంకరాచార్యులవారు తమ పర్యటనలలో అమ్మవారిని దర్శించి ఉగ్రస్వరూపిణిగా వున్న అమ్మవారిని శ్రీచక్రం వేసి శాంతి స్వరూపిణిగా మార్చారని పురాణ కథనం. ఇక్కడే 12వ శతాబ్దంలో విష్ణువర్ధన మహారాజు అమ్మవారిని కొలిచినట్లు శాసనాలు చెబుతున్నాయి.విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు అమ్మవారిని దర్శించుకున్నట్లు చరిత్రలో ఉంది.ప్రతి సంవత్సరం కొన్ని లక్షలమంది ఈ దేవాలయానికి వచ్చి దర్శనం చేసుకొంటారు. ఈ ఆలయానికి హిందూ పురాణాల్లో ప్రత్యేకమైన స్థానం ఉంది.

**ఉపాలయాలు** : ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయంతోపాటు మల్లేశ్వరాలయం, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, నటరాజస్వామి ఆలయం ఉన్నాయి. చఅమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఈ ఆలయాలను కూడా దర్శించుకుని పూజలు చేస్తారు. దసరా రోజు తెల్లవారుఝాము నుంచి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిగా దర్శనమిస్తారు. అనంతరం అదేరోజు సాయంత్రం తెప్పోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తారు. అన్నదానంతోపాటు ఉచితంగా పులిహోర, కదంబం, అప్పం ప్రసాదం ఉచితంగా అందిస్తారు. అవతారాలు- నైవేద్యాలు దసరా నవరాత్రుల్లో దుర్గాదేవిని వివిధ రూపాల్లో కొలుస్తారు. ఆమె నామాలు, అవతారాలు, రూపాలు అనేకం. చఏ రూపంలో కొలిచినా ఆమెకి ఇష్టమైన నైవేద్యాన్ని పెడితే పూజకి మరింత ఫలితం దక్కుతుందని అంటారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ఏ రోజు ఏ అవతారంలో దర్శనం ఇస్తారో తెలుసుకుందాం.

**తొలి రోజు:** మొదటిరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ భక్తులకు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి గా దర్శనమిస్తుంది. అష్ట భుజాలతో సింహాసనం మీద త్రిశూలధారియై.. కనకపు ధగధగలతో మెరిసిపోయే ఆ తల్లిని దర్శించుకోవడం నిజంగా భక్తులకు కనుల పండగే. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల దరిద్రాలూ తొలగిపోతాయంటారు.

**రెండవ రోజు:** ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు రెండవరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ చబాలాత్రిపురసుందరీదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు. మనస్సు, బుద్ధి, చిత్తం శ్రీ బాల త్రిపురసుందరీ దేవి ఆధీనంలో ఉంటాయి. చఅభయహస్త ముద్రతో ఉండే ఈ తల్లి అనుగ్రహం కోసం ఉపాసకులు బాలార్చన చేస్తారు. ఈ రోజున రెండు నుంచి పదేళ్ల లోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా భావించి.. పూజించి కొత్త బట్టలు పెడతారు. అమ్మవారికి ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగు చీరలు కట్టి పాయసం, గారెలను నైవేద్యంగా నివేదిస్తారు. శ్రీ బాల త్రిపుర సుందరీదేవిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని అర్చకులు చెబుతున్నారు.

**మూడవ రోజు:** దుర్గగుడిలో మూడో రోజున అమ్మవారు గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సకల మంత్రాలకు మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన ముక్తా, విద్రుమ, హేమ నీల, దవళ వర్ణాలతో ప్రకాశించే పంచ ముఖాలతో గాయత్రీదేవి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందుతారు.

గాయత్రీదేవి శిరస్సులో బ్రహ్మ, హృదయంలో విష్ణువు, శిఖలో రుద్రుడు నివసిస్తారని పురాణాలు చెబుతున్నాయి. కర్మసాక్షి సూర్యభగవానుడు గాయత్రీమంత్రానికి అధిష్టాన దేవతగా భాసిల్లుతున్నాడు. గాయత్రీమాతను దర్శించుకోవడం వల్ల సకల మంత్ర సిద్ధి ఫలాన్ని పొందుతారని భక్తుల విశ్వాసం.

**నాలుగో రోజు:** అమ్మవారి అవతారాల్లో అన్నపూర్ణాదేవి రూపం విశిష్టమైనది. ఉత్సవాలు ప్రారంభమైన నాలుగో రోజున ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఎడమ చేతిలో బంగారు పాత్రతో.. తన భర్త అయిన ఈశ్వరునికి భిక్షను అందించే రూపంలో వున్న అమ్మవారిని దర్శించుకుంటే ఆకలి బాధలు వుండవని భక్తుల విశ్వాసం.

**అయిదవ రోజు:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో అయిదో రోజున అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం రోజున అమ్మవారు మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి త్రిశక్తి స్వరూపాలతో దుష్టసంహారం చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. సకల విద్యలకు అధిదేవతగా వున్న సరస్వతీ దేవిని దర్శించుకుని అమ్మవారి అనుగ్రహం పొందేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. చమూలానక్షత్రం రోజు నుంచి విజయదశమి విశేష పుణ్యదినాలుగా అమ్మవారి ఆరాధనలు ముమ్మరమవుతాయి.

**ఆరవ రోజు:** దసరా వేడుకల్లో అమ్మవారు ఆరో రోజున శ్రీ లలితా త్రిపురసుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీచక్ర అధిష్టాన దేవతగా.. పంచదశాక్షరీ మంత్రాధిదేవతగా కొలిచే భక్తులకు అమ్మవారు వరప్రదాయినిగా నిలుస్తారు. సాక్షత్తూ శ్రీలక్ష్మి, సరస్వతీదేవి ఇరువైపులా వింజామరలతో సేవిస్తుండగా... చిరు మందహాసంతో.. చెరుగడను చేతపట్టుకుని.. పరమశివుని వక్షస్థలంపై కూర్చుకున్న అమ్మవారిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు

**ఏడో రోజు:** ఉత్సవాల్లో ఏడో రోజున అమ్మవారు శ్రీ చమహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు కనువిందు చేస్తారు.జగన్మాత మహాలక్ష్మి అవతారంలో దుష్ట సంహారం చేసి, లోకాలు కాపాడినట్లు పురాణాలు చెబుతున్నాయి. చధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్మి రూపాల్లో అష్టలక్ష్ములుగా అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**ఎనిమిదవ రోజు:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదో రోజున అమ్మవారు రెండు అవతారాలలో దర్శనమివ్వనున్నారు. అమ్మవారు చదుర్గాదేవి రూపంలో, చమహిషాసురమర్ధినిదేవి గా భక్తులకు దర్శనమివ్వనున్నారు. చలోకకంఠకుడైన దుర్గమాసురుడిని వధించి దుర్గాదేవీ స్వకంగా కీలాద్రిపై అవతరించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. దుర్గతులను పోగొట్టే దుర్గాదేవి అవతారాన్ని దర్శించుకుంటే సద్గతులు సంప్రాప్తిస్తాయని భక్తుల విశ్వాసం.

దుష్టుడైన మహిషాసరుడిని అంతమొందించిన భీకర శక్తి స్వరూపిణి మహిషాసుర మర్ధిని రూపంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారు దర్శనమిస్తారు. చఎనిమిది భుజములు.. అష్ట ఆయుధాలు... సింహవాహినిగా.. రౌద్ర రూపంలో వున్న అమ్మవారిని దర్శించుకుంటే.. శత్రు భయం వుండదని భక్తుల విశ్వాసం. మహిషుడిని అంతం చేయడం ద్వారా లోకాలను అమ్మవారు కాపాడినట్లే... భక్తుల మనస్సులోని సకల దుర్గుణాలను అమ్మవారు హరించి వేస్తుందని అమ్మవారి విశిష్టతను పురాణాలు చెబుతున్నాయి.

**తొమ్మిదవ రోజు:** దసరా నవరాత్రి వేడుకల ముగింపు విజయదశమి నాడు ఆఖరి అవతారంగా శ్రీ రాజరాజేశ్వరీదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. వామహస్తంలో చెరకుగడను ధరించి, దక్షిణ హస్తంలో అభయాన్ని ప్రసాదించే రూపంలో శ్రీచక్రరాజ అధిష్టాన దేవతగా అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారు. చెడుపై అమ్మవారు సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమి నాడు అమ్మవారి చక్కని రూపంను దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందుతారు.

# జాతిపిత మహాత్మాకి ఘన నివాళులర్పించిన జివిఎంసి అధికారులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సత్యం అహింస మార్గాలతోనే దేశ స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చునని నమ్మి భారత దేశ స్వతంత్ర్యాన్ని సాధించి తెచ్చి పెట్టిన మహోన్నత వ్యక్తి జాతిపిత బాపూజి మహాత్మాగాంధీని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జివిఎంసి సమీపంలో సెంట్రల్ పార్కు వద్ద ఉన్న వారి విగ్రహాలకు జివిఎంసి కార్పొరేటర్లు బిపిన్ జైన్, భీశెట్టి వసంత లక్ష్మి అధికారులతో కలిసి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో చురుకైన పాత్రను పోషించి సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహోన్నత వ్యక్తి జాతిపిత బాపూజి మహాత్మాగాంధీ అని కొనియాడారు. గాంధీ నమ్మిన సిద్ధాంతాలు సహాయ నిరాకరణ, సత్యాగ్రహం, మురికివాడల పరిశుభ్రం తదితర వంటివి చేసేవారని తెలిపారు. అలాగే లాల్ బహుదూర్ శాస్త్రి గొప్ప స్వాతంత్ర సమరయోధుడిని మహాత్మా గాంధీకి నమ్మకస్తుడని, జై జవాన్ జై కిసాన్ యుద్ధ సమయంలో బాగా పనిచేశారని, భారత దేశ రెండవ ప్రధానిగా పనిచేశారని ఆయన తెలిపారు. ఇటువంటి మహాపురుషులని పుడమి ఉన్నంతవరకు ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ నేపథ్యంలో "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమంలో భాగంగా "స్వచ్ఛ భారత్ దివాస్" కార్యక్రమాన్ని కాపులప్పాడ డంపింగ్ యార్డ్ వద్ద బుధవారం ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిస్తున్నామని అదనపు కమిషనర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్లు ఎస్.ఎస్.వర్మ, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పి.డి. యుసిడి ఎం.వి.డి. ఫణిరామ్, కార్యదర్శి బి.వెంకట రమణ, పర్యవేక్షక ఇంజనీర్ కృష్ణా రావు, జోనల్ కమీషనర్లు పి.సింహాచలం, కె.శివ ప్రసాద్, మల్లయ్య నాయుడు, బి.రాము, కార్య నిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి అడ్వాన్స్‌గా 14 వరద ప్రభావిత రాష్ట్రాలకు రూ. 5858.60 కోట్లను విడుదల

**విజయవాడ, (పీఐబీ):** హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి కేంద్ర వాటాగా జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి అడ్వాన్స్‌గా 14 వరద ప్రభావిత రాష్ట్రాలకు రూ. 5858.60 కోట్లను విడుదల చేసింది. ఇందులో మహారాష్ట్రకు రూ. 1492 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1036 కోట్లు, అస్సాంకు రూ. 716 కోట్లు, బీహార్‌కు రూ. 655.60 కోట్లు, గుజరాత్‌కు రూ. 600 కోట్లు, హిమాచల్ ప్రదేశ్‌కి రూ. 189.20 కోట్లు, కేరళకు రూ. 145.60 కోట్లు, రూ. 50 కోట్లు ఉన్నాయి. మణిపూర్, మిజోరాంకు రూ. 21.60 కోట్లు, నాగాలాండ్‌కు రూ. 19.20 కోట్లు, సిక్కింకు రూ. 23.60 కోట్లు, తెలంగాణకు రూ. 416.80 కోట్లు, త్రిపురకు రూ. 25 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ. 468 కోట్లు, ఈ విపత్తు సహాయ నిధి పేర్కొన్న రాష్ట్రాలు అత్యంత భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాల సమయంలో వరదలు కొండచరియలు విరిగిపడ్డాయి.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోం మంత్రి సహకార మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తగ్గించడంలో ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రాష్ట్రాలకు మోదీ ప్రభుత్వం దన్నుగా నిలుస్తుంది.

వరద ప్రభావిత రాష్ట్రాలైన అస్సాం, మిజోరం, కేరళ, త్రిపుర, నాగాలాండ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మణిపూర్ రాష్ట్రాలకు అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందాలను అక్కడికక్కడే నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి పంపారు.

అంతేకాకుండా, ఇటీవల వరదల వల్ల ప్రభావితమైన బీహార్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన నష్టాన్ని అక్కడికక్కడే అంచనా వేయడానికి ఐఎంసిటిలు త్వరలో పంపనున్నారు. ఐఎంసిటిల అంచనా నివేదికలు అందిన తర్వాత, ఏర్పాటు చేసిన విధానం ప్రకారం, విపత్తు ప్రభావిత రాష్ట్రాలకు ఎన్‌డిఆర్ఎఫ్ నుంచి అదనపు ఆర్థిక సహాయం ఆమోదిస్తారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో ఈ సంవత్సరంలో 21 రాష్ట్రాలకు ఇప్పటికే రూ. 14,958 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి. ఇందులో 21 రాష్ట్రాలకు ఎస్‌డిఆర్ఎఫ్ నుంచి రూ. 9044.80 కోట్లు, ఎన్‌డిఆర్ఎఫ్ నుంచి 15 రాష్ట్రాలకు రూ. 4528.66 కోట్లు రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి నుంచి 11 రాష్ట్రాలకు రూ. 1385.45 కోట్లు విడుదలైన జాబితాలో ఉన్నాయి. ఆర్థిక సహాయంతో పాటు, వరద ప్రభావిత రాష్ట్రాలన్నింటికీ అవసరమైన ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు, ఆర్మీ బృందాలు వైమానిక దళ మద్దతుతో సహా అన్ని రకాల రవాణా సదుపాయ స ది సమన్వయ సహాయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అందించింది.

# భీమిలిలో 94 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి నియోజకవర్గంలో 94 శాతానికి పైగా ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ జరిగింది. భీమిలి అర్బన్, భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోను, జీవీఎంసీ వార్డుల్లోనూ ఇంటింటికీ వెళ్లి పెన్షనర్లకు స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పెన్షన్లు అందించినట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. మొత్తం 1,49,090 మంది లబ్ధిదారులకు రూ.64 కోట్లు అందించారు.

# ప్రణాళికాయుతంగా పనులను చేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ చేపడుతున్న ప్రాజెక్ట్ లు, అభివృద్ధి పనులు శాశ్వత పద్ధతిన ప్రణాళికా యుతంగా వుండాలని, ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా పనిచేయాలని విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు.

ఆయన ప్రభుత్వ అతిథి గృహంలో జివిఎంసి అభివృద్ధి పనులపై విశాఖ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), సి.హెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, పల్లా శ్రీనివాస రావు, పంచకర్ల రమేష్ బాబు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామరావు, వేపాడ చిరంజీవి రావు, ఏపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస రావు, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇతర అధికారులతో సమీక్షించారు.

ఈ సమావేశంలో ముందుగా జివిఎంసి కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జివిఎంసి అభివృద్ధి కార్యక్రమాలపై వివరిస్తూ జివిఎంసి ఆదాయము, ఖర్చు, సిబ్బంది, రోడ్లు, అభివృద్ధి, వీధిలైట్లు, 24 గంటలు తాగునీరు సరఫరా ప్రణాళిక, కొండవాల ప్రాంతాల అభివృద్ధి, క్రీడ మైదానాలు అభివృద్ధి, 15వ ఆర్థిక సంఘం అమృత-20 నిధులతో అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, కాలుష్య నియంత్రణ చర్యలు, భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ, ఆర్థిక విభాగం బలోపేతం తదితర వాటిపై వివరిస్తూ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజా ఆరోగ్య విభాగము, యుసిడి విభాగం, మొక్కల విభాగం తదితర విభాగాలు చేపడుతున్న అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు తెలిపారు.

ఈ సందర్భంగా విశాఖ పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జివిఎంసి అధికారులు ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నగరంలో ప్రధానంగా తాగునీరు, వీధి దీపాలు, కొండవాలు ప్రాంతాలు, రోడ్లు, కాలువలు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్యం, క్రీడలు, ఆక్రమణలు మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు చేపట్టాలని నగరమంతా తాగునీరు కేవలం 30 నిమిషాలు మాత్రమే కొన్ని చోట్ల ఇస్తున్నారని ఆ సమస్య లేకుండా నగరమంతా 24/7 తాగునీరు సరఫరా చేసే విధంగా ఆచరణలోనికి తీసుకురావాలని, అందుకు కావలసిన వనరులు ఇప్పటినుండే సమీకరించుకోవాలని కమీషనర్ కు ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణ సమస్య అధికంగా ఉన్నందున నగరములో ప్రతి దీపం వెలిగేలా అందుకు తగ్గట్టుగా గుర్తించిన 157 బ్లాక్ స్పాట్లలో ఖచ్చితంగా లైట్లు త్వరితగతిన అమర్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కొండవాలు ప్రాంతాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రక్షణ గోడలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ సహాయము తీసుకుంటామని, విపత్తులు సంభవించినప్పుడు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రిటర్నింగ్ వాల్స్ నిర్మాణం తదితర పనులు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విశాఖ నగరం క్రీడలకు ఎంతో అనుకూలమైనదని అందుకు కావలసిన వనరులు నగరంలో ఉన్నందున "ఖేలో ఇండియా" నుండి కావలసిన సహకారాన్ని కేంద్రం నుండి అందించేందుకు మేము కృషి చేస్తామని ఆయన తెలిపారు. విశాఖ నగరం పరిధి పెరుగుతున్నందున గత 20 సంవత్సరాల నుండి ఎన్నో గెడ్డలు ఆక్రమణకు గురయ్యాయని వాటిని నిరోధించేందుకు పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2026 తర్వాత నగరంలో మురుగునీరు సముద్రంలో కలగకుండా చర్యలు చేపట్టి అందుకు కావలసిన ట్రీట్మెంట్ ప్లాంట్లను అభివృద్ధి చేసుకోవాలని, దోమల నియంత్రణ చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. వీధి వ్యాపారస్తులను ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా వారిని నియంత్రించాలని, ఫుడ్ కోర్ట్ పై వస్తున్న ఆరోపణను సమగ్ర విచారణ చేపట్టాలని, దువ్వాడలో ఐటి హిల్స్, ఆర్కే బీచ్ తదితర ప్రాంతాలలో 24 గంటలు ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నగరంలో పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉన్నందున పొరుగు సేవల ద్వారా ఉద్యోగ నియమాకాలను చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదించాలని, గ్రామ కంఠాలలో ఉన్న గృహాలకు ఆస్తి పన్ను విధింపు మార్గాలను అన్వేషించాలని, నగరంలో ట్రాఫిక్ కు అంతరాయమున్న ఆక్రమణ బడ్డీలను తొలగించాలని, నిర్ణీత సమయంలో బిల్డింగ్ ప్లానుల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో జివిఎంసి స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పేదలకు గృహ సముదాయం నిర్మించి ఇచ్చేందుకు ఉపయోగపడతాయన్నారు. నగరంలో రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అలాగే ఒక లక్ష ఇళ్లకు ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇది మంచి ప్రభుత్వమని ఈ ఐదు సంవత్సరాల్లో సమిష్టిగా కృషి చేసి విశాఖ నగర అభివృద్ధికి తోడ్పడుదామని, జివిఎంసి ముఖ్యమైన అత్యవసరమైన ప్రాజెక్ట్ పనులపై నివేదికను సిద్ధం చేసినట్లయితే సిఎస్ఆర్ నిధులు సమకూరుస్తామని కమీషనర్ కు పార్లమెంటు సభ్యులు తెలిపారు.

అనంతరం పలువురు శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు జివిఎంసి అభివృద్ధి పనులపై చర్చించి పరిష్కార మార్గ దిశగా చర్యలను చేపట్టాలని కమీషనర్ కు వివరించారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమీషనర్ లు, ఇంజనీర్లు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో ఘనంగా గాంధీ జయంతి మరియు లాల్ బహుధర్ శాస్త్రి జయంతి వేడుకలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ లో మహాత్మా గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి , అనకాపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కొణతాల రామ కృష్ణ పూల మాలలతో నివాళి అర్పించారు.

అనకాపల్లి జిల్లా శాసనసభ సభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గాంధీ మరియు లాల్ బహుధర్ శాస్త్రి మనకు స్వాతంత్రం తీసుకొరావడం లో ముఖ్య పాత్ర పోషించారని, వారి మార్గదర్శకాలు భారతదేశానికి కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి అని కొనియాడారు. వారి జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లడుతూ గాంధీ , లాల్ బహుదుర్ శాస్త్రి నిరాడంబరంగా జీవించి మనకు స్వేచ్ఛను ఇవ్వడం లో ముఖ్యమైన పాత్రను పోషించారు అన్నారు. వారి జీవన శైలి అందరికీ ఆదర్శం అని తెలిపారు. పౌరులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కోరారు. తదుపరి జిల్లా కలెక్టర్ మరియు శాసన సభ్యులు స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని అనకాపల్లి రైల్వే బ్రిడ్జి మీద మరియు కలెక్టరేట్లో బుధవారం నిర్వహించారు. తదుపరి కలెక్టరేట్ సమావేశ మందిరం లో గాంధీ మరియు లాల్ బహుదుర్ శాస్త్రి చిత్ర పటాలకు జిల్లా రెవిన్యూ అధికారి దయానిధి మరయు జిల్లా అధికారులు పూల మాలాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, రెవెన్యూ డివిజన్ అధికారి చిన్ని కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, తెలుగుదేశం పార్టీ నాయకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, బిజెపి నాయకులు పరమేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హెచ్‌పిఎఫ్ఎస్ ప్రాజెక్ట్ ద్వారా మద్యం షాపులకు దరఖాస్తులు



ప్రభుత్వ మద్యం షాపుల విధానానికి స్వస్తి పలుకుతూ రాష్ట్రంలో నూతన మద్యం పాలసీకి నోటిఫికేషన్ను జారీ చేసామని ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ తెలిపారు. రిజర్వేషన్ షాపులు మినహాయించి మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి కసరత్తు ప్రారంభం అయ్యిందన్నారు.

నూతన మద్యం పాలసీ అమలుకు దరఖాస్తులు మూడు విధాలుగా సబ్మిట్ చేయవచ్చని నిషాంత్ కుమార్ తెలిపారు. పూర్తి ఆన్లైన్ విధానంలో డెబిట్, క్రెడిట్ కార్డులతో పాటు నెట్ బ్యాంకింగ్ పేమెంట్ పద్ధతి ద్వారా పూర్తి చేయవచ్చన్నారు. దరఖాస్తు కోసం https://hpfsproject.com ద్వారా వివరాలు నమోదు చేయాలని , సబ్ మిషన్ తదుపరి పేమెంట్ మోడ్ వచ్చినప్పుడు బ్యాంకు కార్డ్స్ ద్వారా పని పూర్తి చేయవచ్చన్నారు. హైబ్రిడ్ విధానంలో వివరాలు నింపిన తరువాత సి ఎఫ్ ఎం ఎస్ ద్వారా ఎస్ బి ఐ నుండి చలానా వినియోగించి దరఖాస్తును సబ్మిట్ చేయాలన్నారు. మూడో పద్ధతిలో డీడీ తీసుకుని నేరుగా రాష్టంలోని ఎక్సైజ్ స్టేషన్ కు వచ్చి అప్లికేషన్ పొందవచ్చని తెలిపారు. డీడీ నంబర్ ఆధారంగా ఎక్సైజ్ అధికారులు వెరిఫై చేసిన తదుపరి వారి రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుందన్నారు. మంగళవారం నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించామని, 12వ తేదీ నాటికి ప్రైవేటు మద్యం షాపులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రెండేళ్ల కాలపరిమితితో నూతన మద్యం విధానాన్ని ప్రభుత్వం ఖరారు చేయగా, అక్టోబరు 12 నుంచి 2026 సెప్టెంబరు 30 వరకూ ఈ విధానం అమలవుతుందన్నారు.

ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చని అయితే ఒక్కో దరఖాస్తుకు రూ. 2 లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము చెల్లించాలని నిషాంత్ కుమార్ వివరించారు. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా లేదా బ్యాంకు చలానా ద్వారా దరఖాస్తు రుసుము చెల్లించవలసి ఉండగా, డీడీ తీసుకుని నేరుగా ఎక్సైజ్ స్టేషన్లలో అందించే వెలుసుబాటు కూడా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ఈ నెల 11న లాటరీ తీసి లైసెన్స్‌లు ఇస్తామని, 12 నుంచి లైసెన్సుదారులు కొత్త దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ (ఏపీఎస్బీసీఎల్) నడుపుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల విధానం గడువు సోమవారంతో ముగియగా, కొత్త దుకాణాలు ఏర్పాటు అయ్యే వరకు వీటినే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేసామని, యధావిధిగా మద్యం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంత జనాభాను బట్టి మొత్తం నాలుగు శ్లాబుల్లో లైసెన్సు రుసుములు ఖరారు చేశామని నిషాంత్ కుమార్ తెలిపారు. తొలి ఏడాది పది వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో 50 లక్షలు, 10 వేల నుంచి 50 వేల వరకు 55లక్షలు, 50,001 నుండి 5లక్షల వరకు జనాభా ఉంటే 65లక్షలు, ఐదు లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో 85 లక్షలుగా లైసెన్సు రుసుమును నిర్ణయించామని, రెండో ఏడాది ఈ రుసుములపై పది శాతం చొప్పున పెంచి వసూలు చేస్తారని తెలిపారు. ఏటా ఆరు విడతల్లో లైసెన్సు రుసుము చెల్లించవలసి ఉండగా, రిటైల్ వ్యాపారం చేసే లైసెన్సుదారుకు 20 శాతం మేర విక్రయ మార్జిన్ ఉంటుందన్నారు. నగరపాలక సంస్థల్లో మినహా మిగతా చోట్ల మద్యం దుకాణాలను మోడల్ స్టోర్స్‌కు అప్‌గ్రేడ్ చేసుకునేందుకు నూతన విధానంలో అవకాశం కల్పించామని, ఇందుకు ఏడాదికి ఐదు లక్షలు చొప్పున అదనంగా లైసెన్సు రుసుము చెల్లించాలని వివరించారు.ప్రస్తుతం నోటిఫై చేసిన 3,396 మద్యం దుకాణాలకు అదనంగా 12 ప్రీమియం స్టోర్లు ఏర్పాటు చేయనుండగా వీటికి సంబంధించిన విధివిధానాలను విడిగా ఖరారు చేస్తామన్నారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించామని, ఈ స్టోర్ల కాలపరిమితిపై నిర్ణయం తీసుకోవలసి ఉందని, లైసెన్సు రుసుము ఏడాదికి కోటి రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని నిషాంత్ కుమార్ స్పష్టం చేసారు.

99 రూపాయలకే క్వార్టర్: మద్యం ధరలను ప్రభుత్వం తగ్గించాలని నిర్ణయించిందని, క్వార్టర్ 99 రూపాయలకే లభించేలా చర్యలు తీసుకున్నామని నిషాంత్ కుమార్ తెలిపారు. గతంలో మద్యంపై పది రకాల పన్నులు విధించగా,ఇప్పుడు వాటిని ఆరుకు కుదించామని, కొత్తగా మాదక ద్రవ్యాల నియంత్రణ సుంకం వసూలు చేయనున్నామని వివరించారు. దీని ద్వారా వచ్చే వంద కోట్లను గంజాయి, డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం మోపే చర్యలకు, వ్యసన విముక్తి, కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉపయోగిస్తామన్నారు. గీత కార్మికులకు కేటాయించిన 340 దుకాణాలకు 2, 3 రోజుల్లో విధి విధానాలు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. నూతన మద్యం విధానంకు సంబంధించి స్పష్టతతో పలు జీఓలను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. తిరుపతి పట్టణంలో పరిమితంగానే షాపుల ఏర్పాటుకు అనుమతి ఉంటుందని నిషాంత్ కుమార్ పేర్కొన్నారు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి వరకు బస్టాండు వరకు లీలామహల్ సర్కిల్, నంది సర్కిల్, విష్ణు నివాసం, శ్రీనివాసం ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం లేదన్నారు.

# చిరస్మరణీయులు మహాత్మా గాంధీ , లాల్ బహదూర్ శాస్త్రి: గండి బాబ్జి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** చిరస్మరణీయులు మహాత్మా గాంధీ , లాల్ బహదూర్ శాస్త్రి అని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు గండి బాబ్జి శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవి రావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడుతూ అహింసా మార్గంలో ఈ దేశానికి స్వాతంత్రం తీసుకురావడానికి చేసిన కృషిని దేశ ప్రజలు మర్చిపోలేరని ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు అధ్యక్షులు గండి బాబ్జి , ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ సీతం రాజు సుధాకర్ , ఉత్తర నియోజకవర్గం నాయకులు వెల్లంకి భరత్, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోలమర శెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, తోటరత్నం, కార్పొరేటర్లు గొలగని వీరా రావు , ఊరుకుటి నారాయణ,విల్లూరు భాస్కరరావు, దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కెదారి లక్ష్మి జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి గనగళ్ళ సత్య, జిల్లా నాయకులు బొడ్డేటి మోహన్,విల్లూరి చక్రవర్తి,ఎర్నాగుల జగదీష్, పులి రమణారెడ్డి, మందవరపు వాసుదేవ రావు, నరవ పైడ్రాజు, ఈతలపాక సుజాత, బుచ్చరామిరెడ్డి, బంటుమిల్లి సూర్యనారాయణ ,పొడుగు కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పార్లమెంట్ మాజీ సభ్యులు ఎంవివిఎస్ మూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.

# ఎంవీవీఎస్ మూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన ఒమ్మి సన్యాసిరావు






**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** విశాఖ తూర్పు,12,వ వార్డు, కార్యక్రమంలో, మహాత్మా జాతి పిత, మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జయంతి, సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు, అర్పించారు. అలాగే విశాఖ మాజీ పార్లమెంట్ సభ్యులు, గీతం విద్య, వైద్య సంస్థల, వ్యవస్థాపకులు, ఉత్తమ పార్లమెంటరియన్, ఎంవీవీఎస్ మూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు, ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి సన్యాసి రావు, వార్డు అధ్యక్షులు, గాడి సత్యం, పార్లమెంట్ పార్టీఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి పోలరావు, 11,వార్డు అధ్యక్షులు, ముగడ రాజరావు, నాయకులు,దువ్వి తాతరావు, కాయత గోవిందరావు, రాపర్తి గణపతి, ఎస్.గోపి బసవదేముళ్ల,రామకృష్ణ , నర్సింగ్, దువ్విసంతోష్, కాంతారావు దామోదర్, గొలుసు రమణ, పాణింద్ర నాయుడు, తేజ, తాత బాబు,అనుపల్లి ఈశ్వరరావు, రాజు, గోపాల్ కొల్లి ఎర్రజీ, శేఖర్, రమణ,ప్రకాష్,నాయకులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా ఖాదీ సంతలో పాల్గొన్న ఎంపీ సీఎం రమేష్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖాదీ సంత లో పాల్గొని మహాత్ముల విగ్రహాలకు నివాళులర్పించిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పివిఎన్ మాధవ్.

బుధవారం గాంధీ జయంతి మరియు సేవాపక్షోత్సవాలను పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఖాదీ సంత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ హాజరయ్యారు. ముందుగా కూటమి నాయకులు తో కలసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సీ.ఎం రమేష్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అత్యంత ప్రముఖుడైన మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాపు జీవితం, సత్యం, సామరస్యం, సమానత్వంపై ఆధారపడిన ఆదర్శాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయి అని మహాత్మా గాంధీ మనకు అందించిన బాటలో పయనిస్తూ ఆయనని స్మరించుకుందామని జాతిపితగా కీర్తించబడిన మహాత్మా గాంధీ సత్యం, అహింస సూత్రాలను దృఢంగా అనుసరించారని పేర్కొన్నారు. అదేవిధంగా 11 ఏళ్ల నుండి బిజెపి కార్యాలయంలో ఖాదీసంత ఘనంగా నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ చేనేత కార్మికులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతన్నలు మరియు ఖాదీ వర్తకులతో, వివిధ రకాల అమ్మకం స్టాల్స్ వర్తకులతో ముచ్చటించారు. అనంతరం కార్యాలయం లో భారతదేశ రెండవ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రికి కూడా నివాళులర్పించారు. లాల్ బహదూర్ శాస్త్రి తన జీవితాన్ని దేశ సైనికులు, రైతులు, ప్రజల కోసం అంకితం చేశారని "జై జవాన్, జై కిసాన్" నినాదాన్ని లేవనెత్తిన మహోన్నత వ్యక్తి సేవలను స్మరించుకోవాలి అని తెలిపారు. అనంతరం సంతలో ఏర్పాటుచేసిన వివిధ రకాల స్టాల్స్ వద్దకు వెళ్లి ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేసారు.

ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కే ఎస్ ఎన్ రాజు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇంచార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్ రెడ్డి, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇంచార్జి ఎన్.విజయానంద రెడ్డి, బీజేపీ ఏలూరు జిల్లా ఇంచార్జి బి.నరేంద్ర ప్రకాష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, పాలిమేర శ్రీనివాస రావు, శ్రీరంగం ధనేశ్వర రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పల రామ్ కుమార్ మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయ సాధనకు ప్రభుత్వ ఉద్యోగులు కృషి చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జాతిపిత మహాత్మా గాంధీ, స్వాతంత్ర్య సమరయోధులు లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయుల ఆశయ సాధన కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రభుత్వ ఉద్యోగులకు పిలుపు నిచ్చారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూల మాలను వేసారు. అనంతరం గాంధీ, శాస్త్రి చిత్ర పటాలకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్యం,అహింస అస్త్రాలుగా చేసుకొని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాను భావులు మహాత్మా గాంధీ అని, జవాన్ - జై కిసాన్ నినాదం తో జాతిని మేల్కొలిపిన మహానుభావులు లాల్ బహదూర్ శాస్త్రి అని కలెక్టర్ కొనియాడారు. నేడు వీరిద్దరి జయంతి వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

దేశం, దేశ ప్రజలు బాగుండాలనే ఆశయంతో చేసిన వారి త్యాగ ఫలాలను ఈ రోజే కాకుండా ప్రతి రోజూ గుర్తుంచుకోవలసిన అవసరం ఉందన్నారు.వారి ఆశయాలను మనం కొనసాగించాలని, ఆ అవకాశం ప్రభుత్వ ఉద్యోగులుగా మనకు లభించిందని కలెక్టర్ గుర్తుచేశారు. అన్ని శాఖల కంటే రెవిన్యూ శాఖ కీలక మైందని, భూములను రక్షించే అధికారం రెవిన్యూ శాఖకు ఉందన్నారు. అటువంటి అధికారాన్ని పేదలకు ఉపయోగపడేలా, వారికి న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. రెవిన్యూ శాఖతో పాటు మిగిలిన అన్ని శాఖల్లో కూడా వారి స్థాయిలో పేదలకు ఉపయోగపడేలా మంచి పనులు చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**కలెక్టరేట్లో క్లీన్ అప్ డ్రైవ్ కార్యక్రమం**

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా లో భాగంగా క్లీన్ అప్ డ్రైవ్ కార్యక్రమం బుధవారం ఉదయం కలెక్టరేట్లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జేసీ, డిఆర్వో, ఇతర జిల్లా అధికారులు పాల్గొని కలెక్టరేట్ ప్రాంగణ పరిసరాల్లోని చెత్తను సేకరించి అందరిలో స్ఫూర్తిని నింపారు. ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు, గాజు పెంకులను తొలగించి ప్రత్యేక సంచులలో వేశారు. రాబోయే వారంలో కూడా చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్వో కె.మోహన్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.వి. ఈశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మై భారత్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ సాగర్ సుందర్ సాగర్ నినాదం తో క్లీన్లినెస్ ఆఫ్ బీచెస్



**విజయవాడ, (పీఐబీ):** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ సాగర్ సుందర్ సాగర్ నినాదం తో క్లీన్లినెస్ ఆఫ్ బీచెస్ లా ఈరోజు మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరన స్వచ్ఛతాహి సేవ ముగింపు కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిధులందరి చేత గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు పూలమాలవేసి చేసిన సేవలను కొని యాడారు. అనంతరం స్వచ్ఛత హి సేవ ప్రతిజ్ఞ మరియు పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం చేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవ అనే కార్యక్రమం 2014లో మోడీ గారు ద్వారా మొదలైందని అప్పటినుంచి దేశవ్యాప్తంగా ఇది అమలవుతుందని కృష్ణాజిల్లాలో అనేక ప్రాంతాలలో నెహ్రూ యువ కేంద్రం సభ్యులు మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ కలిసి ఈ ప్రోగ్రాం నిర్వహించడం చాలా బాగుందని ఈ ప్రోగ్రాం లో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ భాగం అయినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు

నెహ్రూ యువ కేంద్ర జిల్లా యవజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండు వరకు జిల్లాలో అనేకచోట్ల ఈ కార్యక్రమంను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం కార్యక్రమాలు చేస్తూ వచ్చామని ఈరోజు ముగింపు కార్యక్రమం సందర్భంగా మంగినపూడి బీచ్ లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మరియు సముద్రాలను మంచినీటి సరస్సులను ప్లాస్టిక్ వ్యర్థాలతో పాడు చేస్తున్నామని సముద్రం దగ్గర పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల ను నిర్మూలించడం ద్వారా సముద్ర జీవులకు మరియు ప్రజల కు చాలా మేలు జరిగుతుంది అని తెలిపారు

ఈ కార్యక్రమంలో మరొక అతిథి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఫణి ధూర్జటి మాట్లాడుతూ అడవులు, పర్యావరణం సమతుల్యతను ప్లాస్టిక్ వ్యర్థాలు దెబ్బతీస్తున్నాయని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వస్తువుల దూరంగా ఉండాలని కోరారు.

కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటింగ్ అఫీలేటెడ్ మెంబర్ బి వినోద్ కుమార్ జిల్లా యువజన సంక్షేమ శాఖ మేనేజర్ సుబ్బారావు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ టి బాలాజీ ధనేకుల కాలేజీ ప్రిన్సిపల్ కె రవి రెడ్ క్రాస్ సెక్రటరీ భవిరి శంకర్ నాథ్ ఐక్యం ఫౌండేషన్ శ్వేత ఆకూరి ధనేకుల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు 250 మంది మరియు ఎన్వైకే వాలంటీర్లు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు అందరికీ మై భారత్ కిట్లు ఇవ్వడం జరిగింది మరియు సుమారు 600 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించిన జరిగింది.

# మహాత్ముల సేవలు అజరామరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారత స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది మహాత్ములు అందించిన సేవలు మహనీయమని ఈస్టర్న్ నావెల్ కమాండ్ కేటిబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు..బుధవారం ఇక్కడ ఎన్ఏడి జంక్షన్ కాకానినగర్ కేటిబి కళాక్షేత్రంలో గాంధీ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. తొలుత అధికారులు ఉద్యోగులంతా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఎంతో మంది త్యాగమూర్తుల పోరాటపటిమ వల్లే నేడు మనకు స్వాతంత్ర ఫలాలు సిద్ధించాయన్నారు. స్వాతంత్రోద్య మంలో చురుకైన పాత్రను పోషించి సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహోన్నత వ్యక్తి జాతిపిత బాపూజి మహాత్మాగాంధీ అని శ్రీనుబాబు కొనియాడారు. గాంధీ నమ్మిన సిద్ధాంతాలు సహాయ నిరాకరణ, సత్యాగ్రహం, మురికివాడల పరిశుభ్రం తదితర వంటివి చేసేవారని తెలిపారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి గొప్ప స్వాతంత్ర సమరయోధుడిని మహాత్మా గాంధీకి నమ్మకస్తుడని, జై జవాన్ జై కిసాన్ యుద్ధ సమయంలో బాగా పనిచేశారని, భారత దేశ రెండవ ప్రధానిగా పనిచేశారని ఆయన తెలిపారు. ఇటువంటి మహాపురుషులని పుడమి ఉన్నంతవరకు ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వీరంతా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు...ఈ కార్యక్రమం సంస్థ అధ్యక్షులు బత్తుల చిరంజీవి, ప్రధాన కార్యదర్శి విజనగిరి భాస్కర్ రావు ఆధ్వర్యంలో సభ్యులు బి ఎస్ నాయుడు, సన్యాసి రావు..ఎస్ రమణ, శ్రీనివాస్, రాజ్ కుమార్, రెడ్డిపల్లి యోగిత, గొన్న మహేష్,. జి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



**విజయనగరం:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత మహాత్మ గాంధీకి విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ గౌరవ బగాది సాయి కళ్యాణ్ చక్రవర్తి గారు స్థానిక వీటి అగ్రహారం పాత జిల్లా కోర్టు భవనంలో ఉన్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవా సదన్ లో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పాత జిల్లా కోర్టు భవనములలో మున్సిపల్ ఆఫీసు సిబ్బంది మరియు జిల్లా కోర్టు సిబ్బందితో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహింప చేశారు ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ మరియు రిటైర్డ్ జిల్లా జడ్జి జి దుర్గయ్య మరియు సివిల్ జడ్జ్ తర్లాడ రాజేష్ కుమార్ పాల్గొన్నారు జిల్లా జిల్లా కోర్టు సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.